


RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం




కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 253 గురువారం, అక్టోబర్ 01 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

### బాలల రక్షణ వాహనం నిర్వహణపై ప్రశ్నలు..

# విచారణ వివరాలేవి?

- డీజిల్ ఖర్చుల నుంచి డ్రైవర్ వేతనాల వరకు సందేహాలు..
- లాగ్‌బుక్, బిల్లులు తనిఖీ చేశారా?
- ప్రత్యామ్నాయ వాహనాల వినియోగంపై ఆరా తీశారా?




**వరంగల్ జోర్దార్ నిఘా విభాగం**

బాలల రక్షణ కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ వాహనం నిర్వహణ, డీజిల్ ఖర్చులు, డ్రైవర్ వేతనాలు, బిల్లుల చెల్లింపులకు సంబంధించిన అంశాలు వరుస పత్రికా కథనాలతో చర్చల్లోకి వచ్చాయి. ఈ అంశాలపై అధికారులు వివరణ ఇచ్చినప్పటికీ, వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కేవలం వివరణతోనే వ్యవహారం ముగిసిందా? లేక సంబంధిత రికార్డుల ఆధారంగా సమగ్ర పరిశీలన చేపట్టారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాహన నిర్వహణకు సంబంధించిన బిల్లులు, డీజిల్ కొనుగోళ్లు, మరమ్మతుల ఖర్చులు, డ్రైవర్ వేతనాల చెల్లింపులపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వాహనం ఏ తేదీన ఎక్కడికి వెళ్లింది? ఏ బాలల రక్షణ కేసు కోసం వినియోగించారు? ఎంత దూరం ప్రయాణించింది? అందుకు ఎంత డీజిల్ ఖర్చయింది? అనే వివరాలను లాగ్‌బుక్, డీజిల్ బిల్లులతో సరిపోల్చారా? డ్రైవర్ హాజరు, విధుల నిర్వహణ, వేతనాల చెల్లింపులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారా? అన్నది తెలియాల్సి ఉంది.

**అత్యవసర సమయాల్లో ఇతర వాహనాలు ఎందుకు?**

బాలల రక్షణకు సంబంధించిన అత్యవసర కేసుల్లో ప్రభుత్వ వాహనం అందుబాటులో లేని సందర్భాలు ఎదురయ్యాయా? అలాంటి సమయంలో ఇతర వాహనాలను వినియోగించాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది? ఎన్ని సందర్భాల్లో ప్రత్యామ్నాయ వాహనాలను ఉపయోగించారు? వాటి కోసం ఎంత మొత్తం ఖర్చు చేశారు? ఆ ఖర్చులకు ఎవరు అనుమతించారు? చెల్లింపులకు సంబంధించిన బిల్లులు, అనుమతి పత్రాలను పరిశీలించారా? అనే అంశాలపైనా స్పష్టత అవసరమవుతోంది.

**వివరణ ఇచ్చిన అధికారులు.. తదుపరి చర్యలపై మౌనం?**

గతంలో పత్రికల్లో వెలువడిన కథనాలపై అధికారులు వివరణ ఇచ్చినప్పటికీ, వాటి ఆధారంగా ఏదైనా అంతర్గత విచారణ ప్రారంభించారా? విచారణకు ఆదేశాలు జారీ చేసి ఉంటే ఎప్పుడు చేపట్టారు? సంబంధిత రికార్డులను పరిశీలించిన అధికారులు ఎవరు? విచారణ నివేదిక సిద్ధమైందా? ఏవైనా లోపాలు గుర్తించారా? బాధ్యులుగా ఎవరినైనా గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. అలాగే బిల్లుల చెల్లింపులు, డ్రైవర్ వేతనాల్లో జాప్యం ఉన్నట్లయితే వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటో వెల్లడించాల్సి ఉంది.

**బాలల భద్రత విషయంలో పారదర్శకతే కీలకం**

బాలల రక్షణ వాహనం అనేది సాధారణ రవాణా సాధనం మాత్రమే కాదు. అవసరమైన సమయంలో పిల్లలను సురక్షితంగా తరలించడం, రక్షణ చర్యలకు సహకరించడం వంటి కీలక విధులకు ఉపయోగపడుతుంది. అలాంటి వాహనం అందుబాటులో ఉండటం, సక్రమంగా నిర్వహించడం, ఖర్చులకు సంబంధించిన లెక్కలు పారదర్శకంగా ఉండటం అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వాహన వినియోగ రికార్డులు, ఖర్చుల వివరాలు, బిల్లులు, వేతనాల చెల్లింపులను సమగ్రంగా పరిశీలించి, ఇప్పటివరకు చేపట్టిన చర్యలను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు. వరుస కథనాల నేపథ్యంలో నిజనిర్ధారణకు చర్యలు తీసుకున్నారా? ఏవైనా లోపాలు బయటపడ్డాయా? వాటిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

### ఆదిలాబాద్‌లో కిసాన్ మేళా నిధుల

# గోల్‌మాల్..

- సమావేశం పెట్టకముందే నిధుల విడుదల!
- సమగ్ర విచారణకు ఆదివాసి సంఘాల డిమాండ్

**(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)**

ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాల నిర్వహణలో భారీ అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. అసలు ఎలాంటి సమావేశాలు, క్షేత్రస్థాయి ఏర్పాట్లు, ప్రచారాలు నిర్వహించకముందే నిధులను అడ్డగోలుగా విడుదల చేసుకుని స్వాహా చేసిన బాగోతం తాజాగా బయటపడింది. ముఖ్యంగా సమగ్ర విధి విధానాలు రాకముందే, ఎలాంటి కనీస సమావేశాలు పెట్టకముందే 'మామ' అనిపించేసిన వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో జిల్లా వ్యవసాయాధికారిగా పని చేసిన ప్రధాన అధికారితో పాటు పలువురు డివిజన్ స్థాయి అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రికార్డుల పరిశీలనతో బట్టబయలైన అక్రమాలు**

గతంలో జరిగిన కిసాన్ మేళాల నిర్వహణ తీరుపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించగా షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. సమావేశం పెట్టకముందే నిధులు డ్రా చేయడం, క్షేత్రస్థాయిలో ఎలాంటి హంగులు, ఆర్భాటాలు, కనీస సౌకర్యాలు కల్పించకుండానే బిల్లులు మాత్రం భారీగా కాజేసినట్లు తేలింది. నిబంధనలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చి, కాగితాలపైనే మేళాలు నిర్వహించినట్లు చూపించి నిధులు నొక్కేసిన వైనంపై శాఖాపరమైన చర్చ జోరందుకుంది.

**అధికారుల వాటాలు.. తూతూ మంత్రంగా నిర్వహణ**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించిన నిధులను క్షేత్రస్థాయిలో ఖర్చు చేయకుండా అప్పటి జిల్లా అధికారి నేతృత్వంలో డివిజన్ స్థాయి అధికారులు అంతా కలిసి ముందస్తుగా వాటాలు పంచుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేవలం నామమాత్రపు ఖర్చులతో కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా ముగించి, మిగిలిన లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కిన ఈ వ్యవహారంపై స్థానిక రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**'తుడుం దెబ్బ' తీవ్ర నిరసన.. సమగ్ర విచారణకు డిమాండ్**

కిసాన్ మేళా నిధుల గోల్‌మాల్ ఉదంతంపై ఆదివాసి హక్కుల పోరాట సమితి 'తుడుం దెబ్బ' తీవ్రంగా స్పందించింది. రైతులను ఆదుకోవాల్సిన అధికారులే నిధుల పేరుతో నిలువునా మోసం చేయడం దారుణమని మండిపడింది. మేళాల పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన అప్పటి జిల్లా అధికారి మరియు సంబంధిత డివిజన్ అధికారులపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచా రణ జరపాలని డిమాండ్ చేసింది. అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకో వాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించింది

### విద్యాశాఖలో నిధుల గోల్‌మాల్? తవ్వేకొద్దీ

# బయటపడుతున్న కొత్త ఆరోపణలు

- ఉపాధ్యాయుల పారితోషికం నుంచి సర్పంచుల వర్క్‌షాప్ బిల్లుల వరకు..
- హాజరు ఒకలా.. బిల్లులు మరోలా!
- నిధుల వినియోగంపై సమగ్ర విచారణకు డిమాండ్




**కరీంనగర్ జోర్దార్ నిఘా విభాగం**

విద్యాశాఖలో ఆర్థిక లావాదేవీలపై వరుసగా ఆరోపణలు వెలుగులోకి వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన పారితోషికాల చెల్లింపుల్లో కోతలు పెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో, గతంలో జరిగిన చెల్లింపులు, ప్రజాప్రతినిధుల వర్క్‌షాప్ నిర్వహణ ఖర్చులపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలపై అధికారిక విచారణ జరిగితేనే వాస్తవాలు స్పష్టమవుతాయని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మూల్యాంకన పారితోషికాలపై ప్రశ్నలు 2025లో పదో తరగతి జవాబు పత్రాలు దిద్దిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పారితోషికంలో కోతలు పెట్టారన్న ఆరోపణలు ఇప్పటికే చర్చకు వచ్చాయి. తాజాగా 2022లో ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించిన పారితోషికాలు కొంతమంది ఉపాధ్యాయులకు అందలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెల్లింపులపై గతంలో ప్రశ్నించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని చెప్పినట్లు సమాచారం. అయితే ఈ ం సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**సర్పంచుల వర్క్‌షాప్ బిల్లుల్లో వ్యత్యాసాల ఆరోపణలు**

'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించిన ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల కోసం వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేశారు. సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు భోజనం, ఇతర ఏర్పాట్ల కోసం ఒక్కొక్కరికి రూ.800, పార్టిసిపెంట్ కిట్‌కు రూ.100 చొప్పున కేటాయించినట్లు కథనంలో పేర్కొన్నారు. నియోజకవర్గానికి రూ.25 వేల వరకు ఖర్చు చేసే వెసులుబాటు ఉండగా, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ హాజరుకు, బిల్లుల్లో చూపిన సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసాలున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

**హాజరైనవారు తక్కువ.. బిల్లుల్లో ఎక్కువ?**

ఓ నియోజకవర్గంలో సుమారు 140 మంది సర్పంచులు ఉండగా, వర్క్‌షాప్‌కు 40 మంది మాత్రమే హాజరైనప్పటికీ అందరూ పాల్గొన్నట్లు చూపించి బిల్లులు సమర్పించారనే ఆరోపణలు ఉన్నాయి. మరో నియోజకవర్గంలో సుమారు 50 మంది హాజరుకాగా, 110 మందికి పైగా పాల్గొన్నట్లు చూపి బిల్లులు డ్రా చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఇలాంటి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు బోగస్ బిల్లులు క్లెయిమ్ చేసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ మొత్తాలు, చెల్లింపులపై అధికారిక ధ్రువీకరణ అవసరం.

**రికార్డుల పరిశీలనతోనే వాస్తవాలు వెలుగులోకి**

కొన్ని వర్క్‌షాప్‌లకు ప్రైవేట్ విద్యాసంస్థలు వేదికలు, ఇతర సదుపాయాలు కల్పించినప్పటికీ, ఖర్చుల చెల్లింపులు విద్యాశాఖ ద్వారా జరిగినట్లు చూపించారన్న ఆరోపణలున్నాయి. నోడల్ అధికారుల పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో ఎవరి పాత్ర ఎంత ఉందనేది విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. హాజరు రిజిస్టర్లు, ప్రజాప్రతినిధుల జాబితాలు, ఫొటోలు, వీడియోలు, బిల్లులు, వోచర్లు, బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. స్వతంత్ర ఆడిట్ నిర్వహించి, అక్రమ చెల్లింపులు జరిగినట్లు తేలితే బాధ్యుల నుంచి నిధులు రికవరీ చేయడంతోపాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ ఆరోపణలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు

# సీఎం రేవంత్ అభినందనలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 30:** ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో చికిత-సాహిల్ జోడీకి గోల్డ్ వరించింది. దీంతో ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించిన చికిత.. 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో సర్ణం సాధించిన పెద్దపల్లికి చెందిన చికిత ప్రతిభపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. చికిత విజయం తెలంగాణ క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. చికిత పట్టుదల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఆసియా క్రీడలు 2026లో కాంపౌండ్ ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికిత, సాహిద్ జోడి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. ఈరోజు(బుధవారం) జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జంగ్యాన్, చోయ్ యోంగ్‌హీ జోడీని షూట్‌ఆఫ్‌లో ఓడించి చికిత, సాహిల్ జోడి స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో 157-157తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు షూట్‌ఆఫ్ నిర్వహించారు. ఈ సమయంలో చికిత, సాహిల్ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బుల్స్‌ఐని కొట్టడంతో భారత్ ఖాతాలోకి మరో పసిడి వచ్చి చేరింది.

### గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'.. వీబీ జీ రామ్ జీ అమలుపై

# మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 30:** వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అం దేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, అమలును మరింత పటిష్ఠం చేయా లని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మంది కిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ , ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల,పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

● మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి



**గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి స్పష్టం చేశారు. మున్సిపల్ షాపుల అద్దె వసూళ్లు, నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయిన నేపథ్యంలో ఆమె స్పందించారు. అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులు ఎవరైనా, ఎంతటి స్థాయిలో ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. మున్సిపాలిటీలో చోటుచేసుకున్న అవకతవకలపై ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాజాగా వెలుగులోకి వచ్చిన అద్దె సొమ్ము వ్యవహారంతో పాటు, గతంలో సదరు ఉద్యోగుల హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవినీతి, అక్రమాలపై కూడా వివరాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలికితీస్తామని, తప్పు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని చైర్‌పర్సన్ జయలక్ష్మి స్పష్టం చేశారు.

# రైతుల సంక్షేమమే
## కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



● పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పీఏసీఎస్ చైర్మన్ పింగళి వెంకటరెడ్డితో పాటు నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.
రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటల కొనుగోలు తదితర అంశాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు రుణాలు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, బిగుల్ల సురేష్, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడు
## చుంచు రవన్న మృతి



**హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**తెలంగాణ ఉద్యమకారుడు, దేవన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ చుంచు రవన్న (చుంచు రవిందర్) మృతి చెందారు. ఆయన మృతి వార్తతో దేవన్నపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు,తెలంగాణ ఉద్యమకారులు,వివిధ వర్గాల నాయకులు ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చుంచు రవన్న తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఉద్యమానికి తనవంతు సేవలు అందించారని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేశారు. దేవన్నపేట గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు.గ్రామ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన ఆయన సేవలను గ్రామస్తులు స్మరించు కున్నారు.తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను,గ్రామ అభివృద్ధి కోసం చేసిన కృషిని పలువురు నాయకులు, ఉద్యమకారులు గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు.
చుంచు రవన్న మృతి గ్రామానికి,తెలంగాణ ఉద్యమకారులకు తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అర్హులకు హెల్త్ కార్డుల పంపిణీ



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**వడ్డేపల్లి మున్సిపాలిటీలో అర్హులైన లబ్ధిదారులకు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు లబ్ధిదారులను గుర్తించి వారికి హెల్త్ కార్డులను అందజేశారు.
హెల్త్ కార్డుల ద్వారా అర్హులైన వారికి ఆరోగ్య సేవలు, వైద్యపరమైన ప్రయో జనాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.
ప్రజలు ఆరోగ్య సంబంధిత పథకాలను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతి నిధులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల హక్కులపై
# కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు

● డిపెండెంట్ ఉద్యోగాలు దానం కాదు.. కార్మికుల హక్కు
● మెడికల్ బోర్డుల్లో నామమాత్రపు అన్‌ఫిట్‌లు వద్దు
● సింగరేణి బొగ్గు నాణ్యతపై సీఎం తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆరోపణలు




**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:**సింగరేణి కార్మికుల వారసులకు ఇచ్చే డిపెండెంట్ ఉద్యోగాలు ప్రభుత్వం చేస్తున్న దానం, ధర్మం కాదని, అవి కార్మికుల హక్కు అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కారుణ్య నియామకాలను తగ్గిస్తూ సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు.మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులకు సకాలంలో మెడికల్ బోర్డులు నిర్వహించకుండా కాలయాపన చేశారని కవిత పేర్కొన్నారు. హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సింగరేణి బాయ్‌బాట కార్యక్రమం నిర్వహించి, మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకపోతే నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించిన తర్వాతే బోర్డులు నిర్వహిస్తున్నారని అన్నారు.రెండు నెలలుగా నిర్వహిస్తున్న మెడికల్ బోర్డుల్లో కేవలం 12.5 శాతం మందిని మాత్రమే అన్‌ఫిట్‌గా ప్రకటిస్తున్నారని, మిగతా వారిని డ్యూటీ ఫిట్ అంటూ వెనక్కి పంపుతున్నారని ఆరోపించారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులు కూడా డ్యూటీకి ఫిట్ అంటూ పంపుతున్నారని పేర్కొన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారిని అన్‌ఫిట్‌గా ప్రకటించి వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**కార్మికుల త్యాగాలను గుర్తించాలి**

సింగరేణి కార్మికులు తమ చెమట, రక్తాన్ని ధారపోసి తెలంగాణకు వెలుగులు అందిస్తున్నారని కవిత అన్నారు. బొగ్గు గనుల్లో పనిచేస్తూ అనేక అనారోగ్య సమస్యలకు గురై కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్మికుల త్యాగాలను గుర్తించి వారి వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించే విధానం ఏర్పడిందని, అది ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలతో వచ్చినది కాదని అన్నారు.మెడికల్ బోర్డుల పేరుతో కాలయాపన చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**సింగరేణి బొగ్గు నాణ్యతపై సీఎం వ్యాఖ్యలపై అభ్యంతరం**

సింగరేణి బొగ్గు నాణ్యతపై ముఖ్యమంత్రి చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కవిత ఆరోపించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు జీ-9, ఇతర థర్మల్ పవర్ ప్లాంట్లకు జీ-11 బొగ్గు అవసరమని, సింగరేణిలో ఆ స్థాయి బొగ్గు అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని సీఎం చెబుతున్నారని అన్నారు.సింగరేణిలో జీ-3 నుంచి జీ-8 వరకు అధిక నాణ్యత గల బొగ్గు అందుబాటులో ఉందని ఆమె పేర్కొన్నారు. జేవీఆర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, మణుగూరు ఓసీ-2 ఎక్స్‌టెన్షన్, కేహెచ్‌పీ, రామగుండం-11 ఇంక్లైన్, భూపాలపల్లి కాకతీయ ఓసీపీ-2, ఓసీపీ-3, మందమర్రి కాసిపేట-2, ఆర్‌కేపీ సీహెచ్‌పీ, శ్రీరాంపూర్ ఆర్‌కే-6, ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో జీ-9 బొగ్గు అందుబాటులో ఉందని వివరించారు.

**రూ.54 వేల కోట్ల బకాయిలపై ప్రశ్నలు**

సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను ఎగ్గొట్టేందుకు బొగ్గు నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని కవిత ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవడం ద్వారా ప్రైవేట్ సంస్థలకు ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశం ప్రభుత్వ నిర్ణయాల వెనుక ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న జీ-9 బొగ్గును కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రభుత్వం, తెలంగాణలోని విద్యుత్ ప్లాంట్లకు మాత్రం అదే స్థాయిలో సరఫరా చేయడం లేదని అన్నారు. కార్పొరేట్ సంస్థలతో కలిసి సింగరేణిని దెబ్బతీసే కుట్ర జరుగుతోందని, పర్మినెంట్ ఉద్యోగాలను తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. సింగరేణిపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తెలంగాణ రక్షణ సేన ప్రజలకు వివరిస్తుందని, సంస్థ ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆమె ప్రకటించారు

# ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్‌కు
## ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

● పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానం చేసిన ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు





**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**సింగరేణి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ జన్మదిన సందర్భంగా లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సభ్యులు రొడ్డ బాపు, పెద్దపల్లి జిల్లా యువజన నాయకులు గొర్రె నరేష్ యాదవ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం సుంకర మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.సింగరేణి ఆర్జీ-3 ఏరియా అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు స్థానిక ప్రాంతాల అభివృద్ధిలో యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య సమన్వయం ఎంతో కీలకమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. జీఎం సుంకర మధుసూదన్ ఆధ్వర్యంలో ఆర్జీ-3 ఏరియా మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.
జన్మదిన వేడుకల సందర్భంగా ఆత్మీయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారికి జీఎం సుంకర మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్జీ-3 ఏరియా యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన నాయకుల మధ్య ఉన్న సత్సంబంధాలకు వేదికగా నిలిచింది.

# వికసిత్ గ్రామ పంచాయతీ
## ప్రణాళికపై శిక్షణ



● గ్రామ సభలో పనుల గుర్తింపు, ఆమోదంపై అవగాహన

**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ)పై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపు, ప్రణాళిక రూపకల్పనపై అవగాహన కల్పించారు.వీజీపీపీ గ్రామ సభలో గ్రామ వనరుల మ్యాప్, సామాజిక మ్యాప్‌లను రూపొందించి, 375 రకాల పనుల్లో గ్రామానికి అవసరమైన, ఇంకా లోటుగా ఉన్న పనులను గుర్తించాలని సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామ సభలో ఆయా పనులను ప్రతిపాదించి ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గుర్తించిన 375 పనుల్లో నీటి సంరక్షణకు సంబంధించినవి 128, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించినవి 111, జీవనోపాధి కల్పనకు సంబంధించినవి 99 ఉన్నాయని వివరించారు. తుఫాన్లు, వరదల సమయంలో చెరువులు, కుంటలకు గండ్లు పడినప్పుడు రక్షణ గోడల నిర్మాణం వంటి విపత్తుల నివారణకు సంబంధించిన పనులు 33 ఉన్నాయని అధికారులు తెలిపారు

# రైతులు--విద్యార్థుల భాగస్వామ్యంతో
## గ్రామాభివృద్ధిపై అధ్యయనం

● మడిపల్లి గ్రామ వనరులు, సమస్యల గుర్తింపు



**హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**మాడిపల్లి గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ లో భాగంగా సహభాగిత గ్రామీణ మదింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతులు, గ్రామస్థులతో కలిసి వ్యవసాయ విద్యార్థులు గ్రామ వనరులు, సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామ సామాజిక, వనరుల మ్యాప్‌లతో పాటు పంటల శాతం, నేలల రకాలు, గ్రామ చరిత్ర, సమస్యల వృక్షం, మొబిలిటీ మ్యాప్, వెన్ డయాగ్రామ్, సీజనల్ క్యాలెండర్ తదితరాలను రూపొందించి ప్రదర్శించారు. గ్రామంలోని ప్రధాన సమస్యలు, అందుబాటులో ఉన్న వనరులు, పంటల సాగు విధానాలను రైతుల నుంచి తెలుసుకున్నారు.విద్యార్థుల కృషినిఏడిఒబి. ఆది రెడ్డి,ఎ ఓ అనురాధ అభినందించారు. వ్యవసాయ, ప్రభుత్వ కార్యక్రమాల్లో రైతులు--విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని వారు పేర్కొన్నారు.డీన్ డా. జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ పిఆర్ ఎ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఇఓ సుమన్,గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి,కోఆర్డినేటర్ టి. సాయి కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ సమస్యలు, వనరులపై సమగ్ర అవగాహన కల్పించిన ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉందని రైతులు పేర్కొన్నారు.

# వెంకటాపూర్‌లో
## గ్రామ సోషల్ మ్యాప్ ఆవిష్కరణ




**గద్వాల్,(జోర్దార్ ప్రతినిధి):**వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సోషల్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో గ్రామంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. నీటి సంరక్షణ చర్యల ద్వారా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరతను కొంతవరకు తగ్గించవచ్చని వివరించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ శక్తులమ్మ, ఉప సర్పంచ్ చిన్న భీము డు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, టీఏ సుశీలమ్మ, అగ్రికల్చర్ ఏఈ నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవరాజ్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి):**జోగులాంబ గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రధాన రహదారులపై మలుపుల వద్ద తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలను పర్యవేక్షించేందుకు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అలాగే జోగులాంబ ఆలయానికి వెళ్లే మార్గాల్లో స్పష్టమైన మార్గసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. రహదారి భద్రతా నిబంధనలు అమలయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# కమీషన్లు వస్తేనే పనులు చేస్తున్న దుద్దిళ్ల!

- ఏడాది గడిచినా కాటారం మార్కెట్ పూర్తి చేయలేదు
- ప్రజలకు ఏం చేశారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి: పుట్ట మధూకర్



**భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:**కమీషన్లు వస్తేనే అభివృద్ధి పనులు చేస్తున్నారంటూ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపణలు చేశారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వెజ్--నాన్‌వెజ్ మార్కెట్‌ను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది క్రితం మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడం అవమానకరమన్నారు.ఎన్నికల్లో కాటారం ప్రజలు పెద్ద మెజార్టీ ఇస్తున్నప్పటికీ వారి కోసం ఏం చేశారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ పూర్తికాక చిరు వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు.కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు తీసుకురావాలని కోరినా ఇప్పటి వరకు నిధులు రాలేదన్నారు.

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పనులు ఎప్పటికి పూర్తవుతాయని ప్రశ్నించారు.

దుద్దిళ్ల కుటుంబానికి ప్రజలు సుదీర్ఘకాలంగా అవకాశాలు ఇస్తున్నప్పటికీ నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు, ఐటీ సంస్థల ఏర్పాటుకు తగిన చర్యలు కనిపించడం లేదన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్నందుకు కేసులు పెట్టినా పోరాటం ఆగదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని పుట్ట మధూకర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో జక్కు రాకేష్, పంతకాని సడవలి, తోట జనార్ధన్, మర్కా రాము, రత్న సౌజన్యరెడ్డి, లక్ష్మీచౌదరి, నరివెడ్డి శ్రీనివాస్, జక్కు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సింగరేణి కంపెనీ స్థాయి క్రీడా పోటీలు

- కబడ్డీలో ఆర్జీ-1, 2 ఏరియా జట్టు విజయం
- బాల్ బ్యాడ్మింటన్‌లో బెల్లంపల్లి-మందమర్రి జట్టు విజేత




**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**సింగరేణి రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన కంపెనీ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ముగిశాయి. కబడ్డీ పోటీల్లో ఆర్జీ-1, 2 ఏరియా జట్టు విజేతగా నిలవగా, బాల్ బ్యాడ్మింటన్‌లో బెల్లంపల్లి-మందమర్రి ఏరియా జట్టు విజయం సాధించింది.ముగింపు కార్యక్రమానికి ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు తాత్కాలికమని, క్రీడాకారులు పట్టుదలతో సాధన చేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. క్రమం తప్పకుండా సాధన చేసి కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పోటీలను ఎలాంటి విభేదాలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి-మందమర్రి, శ్రీరాంపూర్, ఆర్జీ-1, 2, ఆర్జీ-3-భూపాలపల్లి, మణుగూరు-ఇల్లందు, కార్పొరేట్-కొత్తగూడెం ప్రాంతాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం. రామచంద్రరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ ఎ. ఉదయభాస్కర్, పర్సనల్ విభాగాధిపతి బి. సుదర్శనం, ఇతర అధికారులు, స్పోర్ట్స్ సూపర్వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతపై డీఎల్ఏసీ సమావేశం

- రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు



**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)**జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అందించే ఆహార నాణ్యత, పరిశుభ్రత, ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వంటశాలలు, ఆహార పదార్థాల నిల్వ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించేలా పర్యవేక్షించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పంపిణీలో తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

చిరు వీధి ఆహార వ్యాపారులకు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలపై తగిన శిక్షణ అందించి, ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఆహారం అందించే డైట్ క్యాంటీన్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోగులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించే తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు నీటి నమూనాలను పరీక్షలకు పంపించాలని గ్రౌండ్ వాటర్ శాఖ అధికారిని ఆదేశించారు. తాగునీటి నాణ్యతపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజిరెడ్డి, ఏడీ ఫిషరీస్ శ్రీపతి,ఆహార పరిరక్షణ అధికారి సీహెచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ అభివృద్ధి దేశాభివృద్ధికి పునాది

## కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె శంకర్



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి దేశాభివృద్ధికి పునాది వంటిదని కమల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే శంకర్ అన్నారు. కమల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సింగాపూర్ లో కళాశాల సెక్రటరీ మరియు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వి సతీష్ కుమార్ పుట్టినరోజు వేడుకల సమావేశంలో డాక్టర్ శంకర్ ముఖ్య వక్తగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందించే ఉద్దేశంతో ఈ కళాశాలను యాజమాన్యం వారు స్థాపించారని అన్నారు కళాశాల రిజిస్టర్ డాక్టర్ వి రాజేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ విద్యార్థుల ఎదుగుదలకు కృషి చేస్తూ ఉన్నదని అన్నారు ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అధ్యాపకులు డాక్టర్ వేణుగోపాల్, యాకూబ్, ఆఫీస్ సూపరిండెంట్ పెంచాల శ్రీనివాస్‌లు వ్యవహరించారు.

వివిధ విభాగాల అధిపతులు ఇన్చార్జులు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్రమ భూములను స్వాధీనం చేసి ఉద్యమకారులకు పంచాలి



- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ

**హనుమకొండజోర్దార్ ప్రతినిధి:**గత పాలకుల హయాంలో అక్రమంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ, పేదల భూములను గుర్తించి, చట్టబద్ధ విచారణ అనంతరం స్వాధీనం చేసి తెలంగాణ ఉద్యమకారులకు పంచాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. హనుమకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరణి పోర్టల్‌తో పాటు ప్రభుత్వ, అసైన్డ్ భూముల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. గత పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల అక్రమ ఆస్తులపై రాజకీయ జోక్యానికి తావులేని స్వతంత్ర విచారణ చేపట్టి, తప్పు చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన 1,560 కుటుంబాలతో పాటు వేలాది మంది ఉద్యమకారులకు న్యాయం చేయాలని, అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి పొందిన అనంతరం అర్హులైన ఉద్యమకారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యార్థుల మానసిక ఆరోగ్యం భవిష్యత్తుకు బలమైన పునాది



**వరంగల్ జోర్దార్ ప్రతినిధి:**నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దారుఢ్యాన్ని కలిగి ఉంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీ. పి. ఏ) అధ్యక్షుడు పోగు అశోక్ పేర్కొన్నారు. ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం "మానసిక ఆరోగ్యం - ఒత్తిడి నిర్వహణ" అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సు అత్యంత ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా సాగింది. ఈ సందర్భంగా పోగు అశోక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మానసిక ఆరోగ్యం అనేది కేవలం మానసిక సమస్యలు లేకపోవడం మాత్రమే కాదని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసమని తెలిపారు.పరీక్షల భయం, చదువులో ఎదురయ్యే ఒత్తిడిని జయించి ప్రశాంతమైన మనస్సుతో లక్ష్యాల వైపు ఎలా సాగాలో విద్యార్థులకు ఆచరణాత్మక చిట్కాలను వివరించారు.నిరంతర సాధన, సరైన సమయపాలన ద్వారా ఏకాగ్రతను పెంచుకుని చదువులో అత్యుత్తమ ప్రతిభను కనబరచవచ్చని సూచించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించి, మానసిక వికాసానికి తోడ్పడే పుస్తక పఠనం, ఆటలు మరియు ధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మనస్సులో ఉత్పన్నమయ్యే సందేహాలను, భయాలను ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులతో పంచుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనకు గురికాకూడదని అవగాహన కల్పించారు.

పోగు అశోక్ అందించిన ప్రేరణాత్మక ప్రసంగం, ఉదాహరణలు విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని, నమ్మకాన్ని నింపాయి. సదస్సు అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఓపికగా సమాధానమిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి, భవిష్యత్తు బాటలకు ఎంతో ఉపయోగపడే ఇటువంటి అద్భుతమైన సదస్సును నిర్వహించిన పూూ అధ్యక్షుడు పోగు అశోక్ గారికి పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్యా విహారయాత్ర



**వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)**దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పరిశీలనా శక్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారికి ఆనందదాయకమైన అభ్యసన అనుభవాలను అందించేందుకు వరంగల్ జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యా విహారయాత్ర నిర్వహించారు.బుధవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ పర్యటనలో 70 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 20 మంది తల్లిదండ్రులు, 25 మంది ప్రత్యేక విద్యా బోధకులు, సమ్మిళిత విద్యా వనరుల వ్యక్తులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని జూ పార్క్, సెక్రటేరియట్, ట్యాంక్ బండ్‌ను విద్యార్థులు సందర్శించారు.జూ పార్కులో వివిధ రకాల జంతువులు, పక్షులను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు ఉత్సాహంగా గడపారు. పుస్తకాలు, చిత్రాల్లో చూసిన జంతువులను ప్రత్యక్షంగా చూడటంతో వారిలో ఆసక్తి, ఉత్సుకత పెరిగింది. జంతువుల జీవన విధానం, ఆవాసాలు, ఆహారపు అలవాట్లపై అవగాహన పొందారు.ఈ విద్యా విహారయాత్ర విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, ఆత్మవిశ్వాసం, పరస్పర సహకారం, సామాజిక నైపుణ్యాలను పెంపొందించేలా సాగింది. తల్లిదండ్రులు, ప్రత్యేక విద్యా బోధకులు విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ప్రతి ప్రత్యేక అవసరాల విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడం, సమ్మిళిత విద్యను ప్రోత్సహించడమే కార్యక్రమం లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, శ్రీనివాస్ తెలిపారు.

# ఎర్ర తిరుపతికి ఘన సన్మానం



**ఎల్కతుర్తి,జోర్దార్ ప్రతినిధి :**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా సేవలందించిన ఎర్ర తిరుపతి పదవీ విరమణ సందర్భంగా సన్మానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఇన్‌చార్జి హెచ్ఎం ఏ. రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బావుపేట జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ మనోహర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై తిరుపతిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంకని పద్మ, పాఠశాల చైర్‌పర్సన్ సాతూరి రాజేశ్వరి, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ వెంకట రమణారెడ్డి, అంబేద్కర్ జిల్లా అధ్యక్షుడు గొర్రె థామస్, పిఆర్టీయూ-టీఎస్ మండల అధ్యక్షుడు ఎన్. సుధాకర్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఊరంటే వల్ల మాలిన ప్రేమ..!



సామూహిక జీవనానికి ప్రతీక ఊరు
సంతోషపు సుమాల వానలున్నాయి
దుఃఖపు ముళ్ళ గాయాలున్నాయి
అక్కున చేర్చుకున్న సహృదయులున్నారు
అగమ్యమైన బతుకుల దీనావస్థలకు
వెలుగు దారులైన అమరులున్నారు
ఇళ్ళ ముందున్న అరుగులు మాయమనట్లుగా
మనుషుల్లోని ఆత్మీయతలు కరిగిపోతున్నాయి
కలివిడిగా తిరిగిన వాళ్ళు ఒంటరావుతున్నారు
మా ఊరే కాదు ఏ ఊరు మినహింపు కాదు
అందుకే ఊరంటే వల్ల మాలిన ప్రేమ..!



గోపగాని రవీందర్
9440979882

# అన్ని దానాలలో కెల్లా రక్త దానం మిన్న"

**(అక్టోబర్ 1 న జాతీయ రక్త దాన దినోత్సవం సందర్భంగా )**రక్తదానం ప్రాణదానం తో సమానం. అత్యవసర సమయాలలో శస్త్రచికిత్స సమయంలో రక్తం అవసరం ఉంటుంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందక చనిపోయిన వారు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 1 వ తేదీన జాతీయ స్వచ్ఛంధ రక్తదాన దినోత్సవంగా జరుపుకుంటారు. 1975 సంవత్సరము లో స్వరూప కృష్ణన్,డా.జె.జి.జొలిల చొరవతో ఈ రక్త దాన దినోత్సవం ప్రారంభం అయినది. రక్త దానం చేయాలని ప్రోత్సహిస్తూ రక్త దానం ఆవశ్యకతను తెలియ పరచడం రక్తదాన దినోత్సవం ప్రాముఖ్యతగా చెప్పవచ్చు.నేటికీ గ్రామీణ ప్రాంతాలలో రక్తదానంపై ప్రజలకు యువతకు అవగాహన లేదు. రక్త దానం చేస్తే నీరసించి పోతామని, బలహీనపడి పోతామని అపోహ ప్రజల్లో బలంగా ఉంది. వివిధ స్వచ్ఛంద సంస్థలు, రెడ్క్రాస్ లాంటివి గ్రామాల్లో ,పట్టణాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తంని సేకరిస్తున్నారు. ముఖ్యంగా యువత మాత్రం రక్తదానం అంటేనే రెండు అడుగులు వెనక్కి వేస్తున్నారు. ఒకవేళ స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారికి ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల నుండి ప్రోత్సాహం లేకపోవడంచే రక్తదానం చేయడానికి అనేకమంది వెనుకంజ వేస్తున్న సంఘటనలు కోకొల్లలు.. రక్త దానము ఎవరు చేయవచ్చు; ప్రతి ఆరోగ్యవంతుడి లో సుమారు 5 నుండి 6 లీటర్ల రక్తం ఉంటుంది 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల లోపు ఉన్న ఎవరైనా రక్తదానం చేయడానికి అర్హులు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఓమారు అనగా సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చు. 45 కిలోల బరువు పైన ఉన్న వారు మాత్రమే రక్తదానం చేయడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా ఒక వ్యక్తి నుండి రక్తదాత 350 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. రక్తదానం చేసే వ్యక్తిని వైద్యుల సంరక్షణలో కొన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. హైపటైటిస్ బి, హెచ్ ఐ వి ,రక్తహీనత ,బలహీనత, షుగర్ ,దీర్ఘకాలిక వ్యాధులతో, బాధపడేవారు రక్తదానం చేయడానికి అనర్హులు. ఒకవేళ తెలియక చేసి రక్తం ఉపయోగపడదు. రక్తదానం చేసిన




వారికి పూర్తిస్థాయిలో రక్తం 21 రోజుల్లో తిరిగి ఉత్పత్తి అవుతుంది. రక్తంలో మొత్తం ఎనిమిది గ్రూపులు ఉన్నాయి 4 నెగటివ్ గ్రూపులు నాలుగు పాజిటివ్ గ్రూపులు రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీవో నెంబర్ 184 ద్వారా ఆ రోజు స్పెషల్ క్యాజువల్ మంజూరు చేయబడుతుంది. ప్రపంచంలో అధిక మొత్తంలో ఓ పాజిటివ్ వారే అధికంగా ఉన్నారు. ఒక యూనిట్ సుమారు 500 మిల్లీ లీటర్లు రక్తంలో మూడు నిండు ప్రాణాలు కాపాడవచ్చు. రక్త దానం చేసే వారు మిగతా వారికన్నా చాలా చురుకుగా ఆరోగ్యంగా ఉంటారు. రక్త గ్రూపులు దేశవ్యాప్తంగా వాని శాతం ఓ పాజిటివ్ 46% ,ఏ పాజిటివ్ 37 శాతం, బి నెగిటివ్ 8 శాతం, యే నెగిటివ్ 4 శాతం, నెగిటివ్ 2%, ఏ బి నెగిటివ్ ఒక శాతం.ఒక శాతం ఏ బి పాజిటివ్. ఒక శాతం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రెడ్ క్రాస్ అనే అంతర్జాతీయ సంస్థ, మరియు ఆయా జిల్లాల ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న రక్తనిధి కేంద్రాలు అధిక సంఖ్యలో రక్తాన్ని సేకరిస్తున్నాయి. ప్రతి ఏటా వందలాది రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ వేల యూనిట్ల రక్తం సేకరిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాలలో రక్తదాన కేంద్రాలు ఉన్నాయి.

అనేక మంది తమ జన్మదినాలు ,పెళ్లి రోజును పురస్కరించుకొని కూడా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తమ మిత్రులు, బంధువులు, సన్నిహితుల ద్వారా రక్తాన్ని సేకరిచాటుకున్నారు.

బ్లడ్ బ్యాంకుకులకు అందజేస్తూ తమ దాతృత్వంతో,ఉదారతను చాటుతున్నారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులలో కల్తీ రక్తమును విక్రయిస్తున్నట్లు కూడా వార్తలు వినవస్తున్నాయి.రెడ్ క్రాస్,ప్రభుత్వ రక్త నిధి కేంద్రాలలో నామ మాత్రపు డబ్బులతో రక్తమును విక్రయిస్తున్నారు సమాజంలో ఇప్పటివరకు రక్త దానం చేయని వారు అధిక సంఖ్యలో ఉన్నారు.

రక్తదానం చేయడం అంటే ఓ మనిషిని బ్రతికించేధి. రక్తంఎవరికో ఒకరికిఉపయోగపడుతుంది.రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కొరవడింది.

ప్రభుత్వము, స్వచ్ఛంద సంస్థలు కరపత్రాలు, గోడ పత్రికలు, సదస్సుల ద్వారా గ్రామ ప్రజలు యువతలో, మహిళా సంఘాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలి. రక్త దానము మించిన దానం లేదు అనే నినాదాన్ని విశ్వవ్యాప్తం చేయాలి. అధిక సార్లు రక్తదానం చేసిన వారికి విద్య ,ఉద్యోగాలలో ప్రమోషన్లలో సముచిత స్థానం కల్పించాలి.

రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలి..ఆయా గ్రామాల,పట్టణాల యువత, స్వచ్ఛంధ సంస్థలు,దేశ వ్యాప్తంగా లక్షలాది రక్త దాన శిబిరాలు నిర్వహించి రక్తంని సేకరించి కరొనా రోగులకు అందించిన సంధ ర్భములు వున్నాయి.

ప్లాస్మా దానం చేసిన వారు వున్నారు.మనం కూడా రక్త దానం యొక్క ప్రయోజనాలు, ఆవశ్యకతని ప్రతి ఒక్కరికి వివ రించుధాం.రక్త దానం చేయడాకిని ముందుకు వద్దాం. రక్త దాతలను ప్రభుత్వం గుర్తించాలి.

**(అక్టోబర్ 1వ తేదీ జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా 75 సార్లు స్వచ్ఛంద రక్తదాత,ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీత.**

కామిడి సతీష్ రెడ్డి.,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9848445134.

# బాహ్య మూల్యాంకనం చేయాలనే

## విద్యాశాఖ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

● ఆదిలాబాద్

1. 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు పరీక్ష ఫలితాలతో మార్కులు, ర్యాంకులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థిని అకాడమిక్ ఇయర్ పూర్తైన తరువాత వెంటనే పై తరగతికి ప్రమోట్ చేస్తున్న విద్యాశాఖ .

2. పరీక్షలు, మార్కులు, ర్యాంకుల తదితరాలతో ఒత్తిడి లేకుండా విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యనభ్యసించాలనే మనోవైజ్ఞానిక శాస్త్ర సూత్రాలకు బిన్నంగా బాహ్య ముల్యంకణాన్ని ప్రవేశ పెట్టడం హాస్యాస్పదం. ఇట్టి చర్య విద్యార్థుల మానసిక, ఉద్వేగాలపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది.

3. పాఠశాలల్లో బోధనాభ్యసన కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంలో నిర్వహిస్తున్న సమ్మెటివ్ పరీక్ష జవాబు పత్రాల విషయాన్ని బోధించిన ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడం వల్ల విద్యార్థులు ఏ విషయాలపట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో, వెనకబడి ఉన్నారో అవగతమవుతుంది. ఉపాధ్యాయులు తమ బోధనావ్యూహాలను మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. రెమెడియల్ తరగతుల నిర్వహణకు దోహదమవుతుంది.

4. పాఠశాలలో మొదటి పర్యవేక్షణాధికారిగా ప్రధానోపాధ్యాయులు తమ విధులను నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లోని ప్రతి సంఘటన, అంశంపై వారి పర్యవేక్షణ ఉంటుంది. ఆ వైపుగా ఎక్కడైనా లోపాలు జరిగితే ఉన్నతాధికారులు పర్యవేక్షణ నపరించవచ్చు, కాని దానికి భిన్నంగా మొత్తం ఉపాధ్యాయ వ్యవస్థ ని శంకించే విధంగా, వ్యవస్థను అవమానానికి గురి చేసే విధంగా బాహ్య మూల్యాంకన ఉత్తర్వులు ఉన్నవి

5.అసలు పదవ తరగతి మూల్యాంకనం డబ్బులు సంవత్సరాలైనా చెల్లించని విద్యాశాఖ హోమ్ ఎగ్జామ్స్ బాహ్య మూల్యాంకనానికి నిధులు విడుదల చేస్తామనడం హాస్యాస్పదం

అకస్మాత్తుగా బాహ్యముల్యాంకన ఏర్పాటు చేస్తే పరీక్షల్లో ఏం జరుగుతుందో అందరికీ తెలిసిన విషయమే

విద్యాశాఖలో సంస్కరించాల్సిన ఎన్నో విషయాలు ఉన్నాయి

పాఠశాలల్లో వసతులు కల్పించాలి ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా చూడాలి

ప్రతిభకు సంబంధం లేకుండా వయసుతో అడ్మిషన్ కల్పించే ప్రభుత్వ పాఠశాలల్లో బాహ్య ముల్యాంకనం సిద్ధత లేకుండా ఈ సంవత్సరమే నిర్వహించాలని విద్యాశాఖ వింత విపరీత నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం

కాబట్టి ఇట్టి ఉత్తర్వులను వెంటనే ఉపసంహరిచు కోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ( ఆదిలాబాద్ పక్షాన డిమాండ్ చేస్తున్నాము

జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు
మోతే శ్రీనివాస్
బి.వృకోధర్

# దసరాకు పుట్టింటికి వెళ్లే విషయంలో మనస్తాపం

## మహిళ బలవన్మరణం

**మంచిర్యాల,(జోర్దార్ జిల్లా ప్రతినిధి)**దసరా పండగకు పుట్టింటికి వెళ్లే విషయమై భర్తతో ఏర్పడిన మనస్పర్ధల కారణంగా ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం సుందరయ్య కాలనీలో చోటుచేసుకుంది.కాలనీకి చెందిన లావణ్య (32) దసరా పండగకు ముందే పుట్టింటికి వస్తానని రెండు రోజుల క్రితం తన తల్లి రాజేశ్వరికి ఫోన్‌లో తెలిపింది. ఈ విషయాన్ని భర్తకు చెప్పగా ఆయన అంగీకరించలేదని సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన లావణ్య మంగళవారం బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్సై తహిసీనొద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివ



రాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# మధుకర్ మృతి

## పార్టీకి తీరని లోటు



● ఈటల రాజేందర్

**మంచిర్యాల,(జోర్దార్ జిల్లా ప్రతినిధి)** వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా సేవలందించిన ఏటా మధుకర్ మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మధుకర్ సంవత్సరికం సందర్భంగా వేమనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈటల రాజేందర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ మధుకర్ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా, పెద్దపల్లి పార్లమెంట్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

# సీఎం సభకు హుజురాబాద్ నుంచి

## భారీగా కాంగ్రెస్ శ్రేణుల తరలింపు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** తెలంగాణ ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటన సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభకు హుజురాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. వందలాది వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు సిరిసిల్లకు చేరుకున్నారు.సిరిసిల్ల చేనేత కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సీఎం చేపట్టిన మూడు కిలోమీటర్ల పాదయాత్రలో హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిశారు. సీఎం పర్యటనతో హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

ప్రణవ్‌తో పాటు హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు, వైస్ చైర్‌పర్సన్ గూడూరు అంజలి, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గూడూరు స్వామిరెడ్డి, సొల్లు బాబు, పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల, పట్టణ నాయకులు, మహిళా, మైనార్టీ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 36 ఏళ్ల సేవలకు వీడ్కోలు

## ముప్పిడి శ్రీనివాస్‌కు ఘన సన్మానం




**కరీంనగర్,(జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ పట్టణంలోని వి కన్వర్మేషన్ హాల్‌లో బుధవారం డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి ముప్పిడి శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాస్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని, ఉద్యోగ కాలంలో అంకితభావంతో పనిచేయడం ముఖ్యమని అన్నారు. తెలంగాణ కమర్షియల్ టాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారిగా 36 ఏళ్ల పాటు నీతి, నిజాయితీతో సేవలందించి ఎలాంటి మచ్చ లేకుండా పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. డీసీటీఓ ఎం. జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చడంలో శ్రీనివాస్ చురుకుగా పనిచేశారని, ఆయన సేవలకు గుర్తింపుగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారని తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు జి. ప్రభాకర్, ఉపాధ్యక్షుడు జి. భిక్షపతి మాట్లాడుతూ శ్రీనివాస్ ఉద్యోగులు, వ్యాపారులతో స్నేహపూర్వకంగా మెలిగేవారని కొనియాడారు.కార్యక్రమంలో పెద్దపల్లి సీటీవో హరిచరణ్, జగిత్యాల సీటీవో కవిత, సిరిసిల్ల సీటీవో రాజేందర్, కరీంనగర్ సీటీవోలు సత్యనారాయణమూర్తి, వైష్ణవి, సంఘ నాయకులు జి. శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, ఎం. జగన్ మోహన్ రెడ్డి, మహమ్మద్ సలావుద్దీన్, శంకర్, మహమ్మద్ అబ్దుల్ బారి, సునీత, మేనేజర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లెలో ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

**(జోర్దార్ ప్రతినిధి):**గద్వాల మండలం రేపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ మద్దిలేటి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ అజిత్ కుమార్, రెవెన్యూ అధికారులు, సోషల్ వెల్ఫేర్ వార్డెన్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి. కురుమన్న మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలకు తావులేకుండా ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని సూచించారు. అంటరానితనం, రెండు గ్లాసుల విధానం వంటి వివక్షను పాటించడం లేదా ప్రోత్సహించడం నేరమన్నారు. దేవాలయాల్లోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం వంటి వివక్షకు పాల్పడకుండా అందరికీ సమాన హక్కులు కల్పించాలన్నారు. వివక్షకు గురైన వారు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఉన్నత విద్యతో ప్రజల్లో




ఆలోచనా విధానంలో మార్పు వస్తుందని, విద్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజా, దళిత, సామాజిక సేవా సంఘాలు కృషి చేయాలని సూచించారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామస్తులంతా చట్టానికి లోబడి జీవించాలని సూచించారు. అన్యాయం లేదా వివక్షకు గురైన వారు నేరుగా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.డిప్యూటీ తహసీల్దార్ అజిత్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి వంటి కుల వివక్షకు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యాపరంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం కుల, మత భేదాలు లేకుండా అధికారులు, గ్రామస్తులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వార్డెన్లు సుజాత, పద్మ, శ్రీనివాసులు, రమేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి, జీపీఓ, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మాజీ సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ రామగుండంలో ఉద్యోగులకు ఘన వీడ్కోలు



● సూపర్‌యాన్యుయేషన్ సందర్భంగా చందన్ కుమార్ సమంత సహా ముగ్గురికి సన్మానం

**రామగుండం జోర్దార్ ప్రతినిధి:**ఎన్టీపీసీ రామగుండం అండ్ తెలంగాణలో సుదీర్ఘకాలం సేవలందించి సెప్టెంబర్ 30న పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు ఘన వీడ్కోలు పలికారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్అండ్‌టీ) చందన్‌కుమార్ సమంతతో పాటు మెకానికల్ మెయింటెనెన్స్ (బాయిలర్) డిప్యూటీ మేనేజర్ రమేష్ రౌతు, ఎస్ఎల్‌పీఎస్ ఫ్యూయల్ హ్యాండ్లింగ్--ఆపరేషన్ విభాగం ఇంజినీర్ పొగుల స్వామికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చందన్‌కుమార్ సమంత ఎన్టీపీసీలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించారు. సంస్థ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు, నాయకత్వం, అనుభవం కీలకంగా నిలిచాయని అధికారులు, సహచరులు కొనియాడారు.పదవీ విరమణ కార్యక్రమంలో భాగంగా పీటీఎస్‌లోని అంబేద్కర్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అడ్మిన్ బిల్డింగ్‌లోని హెచ్‌ఆర్ ఆడిటోరియంలో వీడ్కోలు, సన్మాన కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా సీనియర్ అధికారులు, సహచరులు పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగుల సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు.

వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు ఉధ్యాయులు కృషి చేయాలని, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలోనీ కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు, మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా




ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ ఇంటర్ బోర్డులో కలకలం!

● బాలికపై అనుచిత ప్రవర్తన ఆరోపణలు.. జూనియర్ లెక్చరర్‌పై సస్పెన్షన్

● ప్రిన్సిపాల్ పాత్రపైనా ప్రశ్నలు.. సమగ్ర విచారణకు డిమాండ్

**హనుమకొండ జోర్దార్ ప్రతినిధి:**హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఓ బాలికపై అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రెగ్యులరైజ్డ్ జూనియర్ లెక్చరర్ రాజ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం.

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అధ్యాపకుడిపై ఇలాంటి ఆరోపణలు రావడం విద్యావర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు, విచారణ నివేదికలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

ఈ వ్యవహారంలో కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బెన శ్రీనివాస్ పాత్రపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ప్రచారంపై కూడా సమగ్ర విచారణ జరపాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




### సస్పెన్షన్‌తోనే సరిపెట్టొద్దు!

బాలిక భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని, సహకరించిన వారిపైనా బాధ్యతను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాకుండా కళాశాలల్లో విద్యార్థుల భద్రతపై నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తున్నారు.

### బాలిక భద్రతే ప్రథమ ప్రాధాన్యం..

ఘటనకు సంబంధించిన పూర్తి నిజానిజాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధితురాలికి న్యాయం చేయాలని, బాధ్యులెవరైనా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# హృదయాన్ని కాపాడే నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

● వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మూడు రోజుల సీపీఆర్ వర్క్‌షాప్

● అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడడంలో సీపీఆర్ కీలకం: డాక్టర్ మమతారెడ్డి

**(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)**అత్యవసర పరిస్థితుల్లో గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి తక్షణ వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశానుసారం వాగ్దేవి విద్యా సంస్థలు, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో, కేఎంసీ పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో 'ఫార్మసీ వీక్ సెలబ్రేషన్స్--2026'లో భాగంగా 'వరల్డ్ హార్ట్ డే--2026'ను పురస్కరించుకొని మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు.

సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు 'సీపీఆర్ ట్రైనింగ్ మరియు కార్డియాక్ క్యాథటరైజేషన్ టెక్నిక్స్' అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. తొలిరోజు కేఎంసీ గేట్ నుంచి ఆసుపత్రి వరకు




ర్యాలీ నిర్వహించి అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సి. మమతారెడ్డి, ప్రొఫెసర్ అండ్ హెడ్, కార్డియాలజీ విభాగం, కాకతీయ మెడికల్ కాలేజ్, ఎంజీఎం హాస్పిటల్, వరంగల్ హాజరై విద్యార్థులకు గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ముఖ్యంగా సీపీఆర్, థ్రాంబోలైటిక్స్ వంటి అత్యవసర చికిత్సా విధానాల ప్రాధాన్యతను, సరైన సమయంలో స్పందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎలా మెరుగుపడతాయో వివరించారు.ఈ శిక్షణలో ఫార్మా--డి, బీఎస్సీ (బయోమెడికల్ సైన్సెస్), ఎంఎస్సీ (న్యూట్రిషన్ సైన్సెస్), నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్డియాలజీ విభాగానికి సంబంధించిన పలు మెళకువలను నేర్చుకున్నారు.

ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులకు సైతం సీపీఆర్ ప్రాముఖ్యత, అత్యవసర సమయంలో బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన విధానంపై అవ గాహన కల్పించారు.

కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. మోహన్‌దాస్, కేఎంసీ పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవరావు, సీటీ సర్జన్ డాక్టర్ సర్ధాజ్, డాక్టర్ నిధేష్, డాక్టర్ రామ్‌రెడ్డి, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శ్రీనివాస్‌రెడ్డి, క్లినికల్ ఫార్మసీ విభాగం హెచ్‌ఓడీ, అధ్యాపకులు డాక్టర్ ఏ. నగేష్, డాక్టర్ వి. స్నేహప్రియ, డాక్టర్ ఎస్. మేఘన, డాక్టర్ కే. హిమబిందు, బయోటెక్నాలజీ అండ్ బయోమెడికల్ సైన్సెస్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ విక్రమ్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగం డీన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం రోగులకు డాక్టర్ మమతారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను వాగ్దేవి కళాశాలల ఫౌండర్, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సి.హెచ్. దేవేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. వాహినీదేవి అభినందించారు.

ప్రజలకు ఉపయోగపడేలా భవిష్యత్తులో మరిన్ని అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని వారు సూచించారు.

# అక్షర తపస్వి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ నీరాజనం

● నాలుగు దశాబ్దాల వృత్తి జీవితాన్ని ముగించిన సాంఘిక ఉపాధ్యాయుడు

**జమ్మికుంట జోర్దార్ విలేఖరి:**కరీంనగర్ జిల్లా జమ్మికుంట బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి వెంకటేశ్వర్లు నేడు పదవి విరమణ చెందారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సతీష్ అధ్యక్షతన జరిగిన సన్మానోత్సవ సమావేశంలో బంధుమిత్రులు, పూర్వ విద్యార్థులు, స్నేహితులు అధిక సంఖ్యలో హాజరైనారు. ఇట్టి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు.. సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో వెంకటేశ్వర్లు అందించిన సేవలను కొనియాడారు. అత్యంత అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తూ ఎందరో విద్యార్థుల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దడాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్య వ్యవస్థ కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత







సందర్భంలో ఉపాధ్యాయ ఉద్యోగ జీవితాన్ని ముగించిన మిత్రుడు వెంకటేశ్వర్లు ధన్యజీవి అని కొనియాడారు. ఆయన మేధాశక్తి అపారమని, రిటైర్మెంట్ తో విద్యార్థులు ఒక ఉత్తమ ఉపాధ్యాయుడిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. డిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా అత్యంత నిబద్ధతతో విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వ విద్య బలోపేతానికి జరుగుతున్న కృషిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. విద్యా పరిరక్షణ ఉద్యమంలో మేధావుల పాత్ర కీలకమని అందులో మమేకమై వారు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సన్మాన గ్రహీత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తన వృత్తి జీవితంలో అనేక పాఠశాలల్లో పనిచేసిన అనుభవాల్ని గుర్తుచేసుకున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. తన ఉద్యోగ జీవితంలో సహాయపడిన సంఘ బాధ్యులు ,ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అల్లుడు సభాముఖంగా వెంకటేశ్వర్లు తనకు తండ్రి లాంటి వాడు అని కొనియాడడం అందరిని ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ హేమలత, జిహెచ్ఎంలు పద్మ, జరీన , బాదం సురేష్ బాబు, వీణవంక కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమౌళి , మడిపల్లి హెచ్ఎం భాగ్యమ్మ తో పాటు ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి లక్ష్మి, వీరాచారి, రమాదేవి , శ్రీలత రమాకుమారి, వి ప్రకాష్ ,అరుణ కరుణా, టి శ్రీనివాస్ మరియు బాల్య మిత్రులు హమ్ 9 ఏక్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# బీసీ ఉపాధ్యాయులపైనే ఫిర్యాదులు - దాడులు

**(హైదరాబాద్ /వరంగల్/ కరీంనగర్ జోర్దార్)**ఇంకా అదే సంస్కృతి కొనసాగుతుంది. అగ్రవర్ణ ఆధిపత్యంలో వెనకబడిన దళిత గిరిజన బిడ్డలు అణచివేయబడుతూనే ఉన్నారు. జిల్లాకు కొందరు అగ్రవర్ణ నాయకులు సంఘాలకు అతీతంగా ఒక కూటమిగా వ్యవహరిస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల మీద రకరకాల దాడులు చేస్తూనే ఉన్నారు. ఎక్కడో ఒక చోట ఒక వెనకబడిన వర్గాల అధికారి ఒక ఉత్తర్వు విడుదల చేస్తే సాంఘిక మాధ్యమాలలో అనేక రకాల వ్యాఖ్యానాలు, పోస్టింగ్స్. ఒక వెనకబడిన వర్గాల ఉపాధ్యాయుడు పొరపాటున తప్పు చేస్తే దానికి చిలువలు పలువలు. నిత్యం వేధింపులు. వారిపై ఈ అగ్రవర్ణాల నిఘా. తప్పుడు ఫిర్యాదులు, ఫేక్ ప్రచారాలు. అదే అగ్రవర్ణాల టీచర్లు నిబంధనలకు విరుద్ధంగా ఎన్నెండ్లు డిప్యూటేషన్ లో ఉన్నా, ఫారిన్ సర్వీసులో ఉన్నా, బడి ముఖం ఏండ్లకు ఏండ్లు చూడకపోయినా సమర్థించుకుంటూ ఈ పిడికెడు అగ్రవర్ణాలు సంఘాలకతీతంగా వారికి మద్దతు. పిల్లలు ఉన్న బడికి కాకుండా తక్కువ సంఖ్య ఉన్న చోటుకి వర్క్ అడ్జస్ట్మెంట్ లో ఇవ్వడం, సిటీకి జిల్లా కేంద్రానికి దూరం నుండి కేటాయించడం,తప్పులు చేసిన వారికి సంవత్సరాలు గడిచినా చర్యలు లేకపోవడం, బడికి పోకుండా తప్పుడు ఎఫ్ ఆర్ ఎస్




వేసుకొని ఇష్టారాజ్యంగా తిరిగినా పట్టించుకోకపోవడం, మెడికల్ సెలవులో ఉంటూ జిల్లా విద్యాధికారి కార్యాలయాల చుట్టూ తిరిగినా వారికి సెలవు మంజూరు ఉత్తర్వులు కార్యాలయాల నుండి వెలువడడం, ఉద్యోగ విరమణ పొందినవారు కార్యాలయంలో చొరబడి అధికారులను బెదిరించడం, గతంలో వారు పనిచేసిన దగ్గర అమ్మాయిలను వేధించి, అందంగా ఉన్న అమ్మాయిల పేర్లు మాత్రమే తెలుసుకొని బ్యాడ్ టచ్ చేసిన వారు బయటకు పొక్కకుండా తప్పించుకొని నీతిమంతుల మాదిరిగా మంది మీద ఫిర్యాదులు చేయడం, రాష్ట్రంలో ఉన్న అధికారులు తెలుసు అంటూ వారి పేర్లు చెప్తూ బెదిరించడం, బడిలో సరిగా రాలేదని ఫిర్యాదు చేసిన టీచర్ల మీద పోక్సో కేసులు బనాయించేలా పిల్లలను ప్రోద్భలం చేయడం వారికి మాత్రమే చెల్లుతుంది. అదే విధంగా పై స్థాయిలో ఉండే అధికారులు సహితం వారు చెప్పింది వింటూ వత్తాసు పలకడం మినహా వాస్తవాలను చూడలేని స్థితిలో ఉంటున్నారు. అగ్రవర్ణాల మీద వచ్చిన ఫిర్యాదులు ఎన్ని ఏండ్లు అయినా అలాగే పెండింగ్ లో ఉండడం, కింది స్థాయి వారు ఏ చిన్న తప్పు చేసినా చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది.

ఒక తప్పును తప్పు అని చెప్పినందుకు రకరకాల ఫిర్యాదులు, ఇతరులను మధ్యలో పెడుతూ బెదిరించడం, కోర్టుల్లో వ్యక్తిగతంగా కేసులు వేయడం చేస్తూ అడ్డగోలుగా బెదిరిస్తూ, సంఘాలను పక్కన పెట్టుకొని, పేరున్న నాయకులను పక్కన పెట్టుకొని కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. వారి మీద అనేక ఫిర్యాదులు, చార్జెస్ ఉన్నా అంతటా పెద్దరికం చేస్తున్నారు. ఒక అగ్రవర్ణ ఉపాధ్యాయుడు, ఒక బలహీన వర్గాల ఉపాధ్యాయుడు ఒకే తప్పు చేస్తే ఇద్దరికి ఒకే రకమైన శిక్ష లేని విపరీత వైఖరి కనపడుతుంది. ఒక వ్యక్తి కనీసం పదిసార్లు ఒక సమస్య మీద విన్నవించుకుంటే ఏండ్లు గడిచినా అలాగే పడేసి పట్టించుకునే నాధుడు లేకపోవడం విచారకరం. విచారణ అధికారికి సహకరించని వారిని ఏమి చేయలేని స్థితిలో ఈరోజు వ్యవస్థ ఉండడం అత్యంత బాధాకరం. బలహీన వర్గాల ఉపాధ్యాయులు ఏకం కావలసిన పరిస్థితి ఏర్పడింది. కానీ బలహీన వర్గాల ఉపాధ్యాయులు పెద్ద పెద్ద సంఘాలలో అగ్రవర్ణాల మోచేతి నీళ్ళు తాగుకుంటూ చిన్న చిన్న పదవుల కోసం తాపత్రయ పడుతుండటం సిగ్గుచేటుగా కనపడుతుంది. అధికారులు రాగద్వేషాలకు పోకుండా, భయభ్రాంతులకు గురి కాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఉపాధ్యాయ లోకం కోరుకుంటున్నది. ఉద్యోగ విరమణ చేసిన వారి మీద కూడా గతంలో చేసిన తప్పుల మీద, అమ్మాయిలు ఇచ్చిన వాంగ్మూలాల మీద విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సమాజం మళ్లీ దొరపటేల్ వ్యవస్థలోకి వెళ్తుందని అనుకుంటున్నారు.

# ఆదిలాబాద్‌లో కిసాన్ మేళా నిధుల గోల్‌మాల్

● సమావేశం పెట్టకముందే నిధుల విడుదల!

**సమగ్ర విచారణకు ఆదివాసి సంఘాల డిమాండ్**

**(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)**

ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాల నిర్వహణలో భారీ అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. అసలు ఎలాంటి సమావేశాలు, క్షేత్రస్థాయి ఏర్పాట్లు, ప్రచారాలు నిర్వహించకముందే నిధులను అడ్డగోలుగా విడుదల చేసుకుని స్వాహా చేసిన బాగోతం తాజాగా బయటపడింది. ముఖ్యంగా సమగ్ర విధి విధానాలు రాకముందే, ఎలాంటి కనీస సమావేశాలు పెట్టకముందే 'మామ' అనిపించేసిన వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో జిల్లా వ్యవసాయాధికారిగా పని చేసిన ప్రధాన అధికారితో పాటు పలువురు డివిజన్ స్థాయి అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రికార్డుల పరిశీలనతో బట్టబయలైన అక్రమాలు

గతంలో జరిగిన కిసాన్ మేళాల నిర్వహణ తీరుపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించగా షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. సమావేశం పెట్టకముందే నిధులు డ్రా చేయడం, క్షేత్రస్థాయిలో ఎలాంటి హంగులు, ఆర్భాటాలు, కనీస సౌకర్యాలు కల్పించకుండానే బిల్లులు మాత్రం భారీగా కాజేసినట్లు తేలింది. నిబంధనలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చి, కాగితాలపైనే మేళాలు నిర్వహించినట్లు చూపించి నిధులు నొక్కేసిన వైనంపై శాఖాపరమైన చర్చ జోరందుకుంది.

### అధికారుల వాటాలు.. తూతూ మంత్రంగా నిర్వహణ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించిన నిధులను క్షేత్రస్థాయిలో ఖర్చు చేయకుండా అప్పటి జిల్లా అధికారి నేతృత్వంలో డివిజన్ స్థాయి అధికారులు అంతా కలిసి ముందస్తుగా వాటాలు పంచుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేవలం నామమాత్రపు ఖర్చులతో కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా ముగించి, మిగిలిన లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కిన ఈ వ్యవహారంపై స్థానిక రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### 'తుడుం దెబ్బ' తీవ్ర నిరసన.. సమగ్ర విచారణకు డిమాండ్

కిసాన్ మేళా నిధుల గోల్‌మాల్ ఉదంతంపై ఆదివాసి హక్కుల పోరాట సమితి 'తుడుం దెబ్బ' తీవ్రంగా స్పందించింది. రైతులను ఆదుకోవాల్సిన అధికారులే నిధుల పేరుతో నిలువునా మోసం చేయడం దారుణమని మండిపడింది. మేళాల పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన అప్పటి జిల్లా అధికారి మరియు సంబంధిత డివిజన్ అధికారులపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించింది

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# ప్రకృతి ఆరాధనకు నిదర్శనం బొడ్డెమ్మ పండుగ

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగకు ముందుగా జరుపుకునే మహోన్నత పండుగ బొడ్డెమ్మ పండుగ .
ఈ పండుగను ముఖ్యంగా కన్నెపిల్లలు కన్నుల పండుగగా జరుపుకుంటారు.
మంచి భర్త రావాలని సంతానం కలగాలని భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు

**బొడ్డెమ్మ పండుగ ప్రారంభం**

భాద్రపద బహుళ పంచమి లేదా దశమి నుండి మహాలయ అమావాస్య వరకు 9రోజులు లేదా 5రోజులు వేడుకలు జరుపుకుంటారు. ఈ వేడుకలు ముగిసిన తరువాత రోజునుండి బతుకమ్మ పండుగ ప్రారంభం అవుతుంది.

**బొడ్డెమ్మ అలంకరణ**

సాయంత్రం సమయం లో ఎర్రమట్టి తో అలికి ముగ్గులు వేసి పసుపు కుంకుమలు పెట్టి బొడ్డెమ్మను అక్కడ ఉంచి పూలతో అలంకరించి చిన్న పిల్లలు మహిళలు అందరూ బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా సంబరాలు జరుపుకుంటారు.

**బొడ్డెమ్మ రకాలు**

ప్రాంతాన్ని బట్టి ఆయా రకాల బొడ్డెమ్మలు తయారు చేసి జరుపుకుంటారు.
1)పీట బొడ్డెమ్మ
పీట మీద పుట్టమన్ను తో 5అంతస్థుల గోపురం లాగా పేర్చి దానిపై గిన్నె పెట్టి అందులో బియ్యం పోసి అందులో పసుపు గౌరమ్మను ఉంచుతారు
2) గుంట బొడ్డెమ్మ
తొక్కుడు పడని స్థలం లో గుంతలాగా తీసి దాని చుట్టూ 5గుంతలు తీసి పూలతో అలంకరిస్తారు
3) పందిరి బొడ్డెమ్మ
పందిరి లాగా పేర్చి సీతాఫలం ఆకులు మొక్క జొన్న కంకులు వేలాడదీస్తారు
4)బాయి బొడ్డెమ్మ
బాయి ఆకారంలో గొయ్యి తవ్వి దాని చుట్టూ మట్టి ముద్దలు వెంపలి చెట్టు నాటి పూజిస్తారు.

**ప్రకృతి ఆరాధన**

బొడ్డ అనగా మేడి చెట్టు అని అర్థం.సంతానం సౌభాగ్యం కోసం ప్రకృతిని పూజించే ఆచారం బొడ్డ పూజగా మారి బొడ్డెమ్మ గా రూపు దిద్దుకుంది.

**బొడ్డెమ్మ రూపాలు**

1వరోజు వరిపూల బొడ్డెమ్మ
2వ రోజు రేగు పూల బొడ్డెమ్మ
3వ రోజు ముత్యాల బొడ్డెమ్మ
4వ రోజు నల్లకలువ బొడ్డెమ్మ
5వ రోజు ఐన్వాల బొడ్డెమ్మ
6వ రోజు ఆవుపాల బొడ్డెమ్మ
7వ రోజు ఏడాకుల బొడ్డెమ్మ
8వరోజు ఎనుముపాల బొడ్డెమ్మ
9వ రోజు తొమ్మిది రంగుల బొడ్డెమ్మ

**బొడ్డెమ్మ నైవేద్యాలు**

1వరోజు నువ్వుల ఉండలు
2వ రోజు చలిమిడి
3వ రోజు సజ్జ పిండి బెల్లం
4వ రోజు తడిపిన పెసరిపప్పు బెల్లం
5వ రోజు అటుకులు బెల్లం
6వ రోజు పరమాన్నం
7వ రోజు పేలాలు పెసరపప్పు చారు
8వ రోజు రవ్వ కేసరి
9వ రోజు సత్తుపిండి

**బొడ్డెమ్మ పాటలు**

బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో
బొడ్డెమ్మ బొడ్డెమ్మ వలలో
బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్
అంటూ రకరకాల పాటలతో పాడి ఆడి సంబరాలు జరుపుకుంటారు.

**బొడ్డెమ్మ నిమజ్జనం**

తొమ్మిది రోజుల తర్వాత బొడ్డెమ్మను ఊరేగింపుగా కోలాటాలతో తీసుకెళ్ళి
పోయిరా బొడ్డెమ్మ పోయి రావమ్మా అంటూ చెరువులో లేదా బావిలో
నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచుకుంటారు.
బొడ్డెమ్మ పండుగ ప్రాశస్త్యము అందరూ తెలుసుకొని ప్రతి ఊరిలో అక్కడక్కడ కాకుండా బతుకమ్మ పండుగ వలె బొడ్డెమ్మ పండుగ కూడా ఘనంగా జరుపుకోవాలని
సంబరాలు చేసుకోవాలని
బతుకమ్మ పండుగ వైభవం బొడ్డెమ్మ పండుగకు కూడా రావాలని ఆశిద్దాం.




# అసలు సూత్ర దారులెవరు...?

- రన్నింగ్ రోస్టర్ మతలబు ఏమిటి...?
- ఎస్టీ పోస్టు నింపకపోవడానికి కారణం ఏమిటీ.?
- మళ్ళీ ఇంటర్వ్యూలకు పిలుస్తారా..?

**జోర్దార్ వరంగల్ ప్రతినిధి:**కాకతీయ యూనివర్సిటీలో పార్ట్ టైం అధ్యాపకుల నియామకంలో అవకతవకలు జరిగాయని ఫలితాలు వెల్లడించిన రోజున బంజారా విద్యార్థి సంఘ నాయకులు వీసీ, రిజిస్ట్రార్ లను కలిసి మాట్లాడిన విషయం విదితమే. ఎస్టీ కేటగిరీలో రెండు ఖాళీలు ఉండగా ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఒక్కరికే సెలెక్ట్ చేసి మరొక ఎస్టీ పోస్టు ఎందుకు భర్తీ చేయలేదని కేయూ రిజిస్ట్రార్ ప్రో. రామచంద్రం ను విద్యార్థి సంఘ నాయకులు అప్పట్లో నిలదీసినప్పటికీ ఇప్పటి వరకు ఆ నియామకంపై ఎటువంటి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

**రన్నింగ్ రోస్టర్ మతలబు ఏమిటి...?**

నోటిఫికేషన్ లో ప్రతి విభాగంలో రన్నింగ్ రోస్టర్ లో ఒకే కేటగిరీ పెట్టడంతో చాలా విభాగాల్లో ఆ తర్వాత వచ్చే రన్నింగ్ రోస్టర్ కేటగిరీకి చెందిన వాళ్ళు దరఖాస్తు చేసుకోలేకపోయారని అభ్యర్థులు అంటున్నారు. బ్యాక్ లాగ్ కేటగిరీలో నోటిఫికేషన్ లో చూపించిన అన్ని కేటగిరీల వాళ్ళు దరఖాస్తు చేసుకున్నా కానీ అందరినీ ఇంటర్వ్యూలకు పిలుసుకోవడంలో మతలబు




ఏమిటి కూడా విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. రన్నింగ్ రోస్టర్ పేరు మీద తనకు తెలిసిన ఇష్టమైన అభ్యర్థులకు సమాచారం ఇచ్చి దరఖాస్తు చేయించారని కూడా విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి.

**ఎస్టీ పోస్టు నింపకపోవడానికి కారణం ఏమిటీ...?**

రెండు ఎస్టీ కేటగిరీ ఖాళీలలో ముగ్గురు అభ్యర్థులు అర్హులుగా ఉన్నప్పటికీ రెండు భర్తీ చేయాల్సింది పోయి కేవలం ఒక్కటే భర్తీ చేయడంలో మతలబు ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మళ్ళీ ఇద్దరు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారా...? మార్కులు మళ్ళీ వేస్తారా...? అనే సందేహాలు వర్సిటీలో చర్చనీయాంశం అయ్యాయి. అయితే



కమిటీలో కేయూ ముఖ్యమైన పాలన అధికారి ఓ.ఎస్.డీ ఉన్నప్పటికీ ఇటువంటి వివాదం రావడంతో దీని వెనుక అసలు సూత్రం దారులు ఎవరన్నది తేలాల్సి వుంది.
ఈ విషయంపై జోర్దార్ ప్రతినిధి కేయూ రిజిస్ట్రార్ ప్రో. రామచంద్రం ను వివరణ కోరగా ఆయన ఫిజిక్స్ విభాగంలో ఎటువంటి అవకతవకలు జరగలేదని వివరణ ఇచ్చారు.

**ఫిజిక్స్ డిపార్ట్మెంట్లో అవకతవకలు జరగలేదు**
**- ప్రో. రామచంద్రం, కేయూ రిజిస్ట్రార్.**

ఫిజిక్స్లో మొత్తం ఖాళీలు ఎనిమిది. దాంట్లో బ్యాక్ లాక్స్ 6 పోస్టులు. రిజర్వేషన్ వైజు గా చూసినప్పుడు బీసీఏ 1 ,బిసిబి ఒకటి ,బీసీసీ ఒకటి, ఎస్టీ రెండు ,ఎస్సీ గ్రూప్-3 ఒకటి, ఈ టోటల్ బ్యాక్లాగ్స్ వచ్చేసి ఆరు . ఫిజిక్స్లో టోటల్ వేకెన్సీస్ ఉన్నవి ఎనిమిది. కాబట్టి లాస్ట్ డిపార్ట్మెంట్ రోస్టర్ 26 దగ్గర కట్ అయిపోయింది. మనకు నెక్స్ట్ వచ్చే రెండు రన్నింగ్ పోస్టర్ పాయింట్లు ఏంటంటే 27 ( ం ఎ గ్రూప్ 2) 28 (జుఔ ). మనకు బ్యాక్లాగ్ ఆరు పోస్టులు ఉన్నాయి. కాబట్టి 6ఆరు ఫిల్ చేసిన తర్వాత, రన్నింగ్ రోస్టర్ 27 28 కి వస్తాది. నోటిఫికేషన్ లో కూడా నోట్ పెట్టి రన్నింగ్ రోస్టర్ ఫాలోస్ అని పెట్టారు. మిగతా డిపార్ట్మెంట్లలో కూడా ఇదే విధముగా రన్నింగ్ రోస్టర్ లో పోస్టు ఫిల్ చేయడం జరిగింది.

**ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టును నింపకుండా ఈ.డెబ్ల్యూ.ఎస్ ఎలా నింపుతారు...?**
**- డా.గూగులోతు రాజ్ నాయక్, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు**

ఈ.డెబ్ల్యూ.ఎస్ కేటగిరీని నోటిఫికేషన్ లో మెన్షన్ చేయనందువలన చాలా మంది చాలా విభాగాల్లో దరఖాస్తు చేసుకోలేదు. నోటిఫికేషన్ లో 8 ఖాళీలు నింపాలని ప్రకటించి ఐదు మాత్రమే నింపి అందులో ఎస్టీ బ్యాక్ లాగ్ ను నింపకుండా రన్నింగ్ రోస్టర్ కు ఎలా వెళ్తారు. ఈ.డెబ్ల్యూ.ఎస్ ను మాత్రమే నింపి మిగతా రన్నింగ్ రోస్టర్ వాళ్లను ఎందుకు అని విభాగాల్లో ఇంటర్వ్యూలకు పిలువలేదు. కొన్ని విభాగాల్లో బ్యాక్ లాగ్ లో అప్లై చేసుకున్న వారిని కూడా ఇంటర్వ్యూలకు పిలువలేదు. ఎస్టీ పోస్టు నింపేదాకా ఉద్యమం కొనసాగిస్తాం. ఎస్టీ కమీషన్ ను ఆశ్రయిస్తాం.

# మూడేళ్లు గడిచిన పిఆర్సి ఇవ్వరా

**(భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యొక్క విద్యారంగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటి పెల్లి లింగారెడ్డి మాట్లాడారు. గన్ పూర్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చెల్పూర్ ఎల్ ఎఫ్ ఎల్ ప్రధాన ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు డి టి ఎఫ్ గన్ పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు విద్యారంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూనే మరొకవైపు ఉపాధ్యాయులకు సంబంధించిన హక్కులను హరించి వేస్తుందని దుయ్యబట్టారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇవ్వాల్సిన పి.ఆర్.సి ఇవ్వగలేకపోవడంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసిన సందర్భంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మా ప్రభుత్వం వచ్చిన వెంటనే పి.ఆర్.సి అమలు చేస్తానని హామీ ఇచ్చిందని కానీ ఇప్పటికీ మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ దాటవేత ధోరణులను అవలంబిస్తుందని ఆవేశపడ్డారు. ఇదే కాకుండా 6 డి ఏ లు రావలసి ఉండగా మొన్నటి ఉద్యమ ఫలితంగా రెండు ఇస్తామని ఒప్పుకున్నప్పటికీ అమలు ఏమవుతుందోనని వేచి చూడాల్సిం




దేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని ప్రస్తుతం 34 శాతం మంది మాత్రమే చదువుతున్నారని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 24 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 16 వేల ప్రాథమిక పాఠశాలలో ఒక్కటి చెరుతోనే బడులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఇంకా రాను రాను బయటకు తెలవకుండానే పాఠశాలలు మూతబడతాయని ఇప్పటికే అనేక పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాలకు గాను 23 జిల్లాలలో డీఈవోలు లేరని, 633 మండలాలు ఉంటే ప్రస్తుతం 612 మండలాలలో పూర్తికాలకు ఎంఈవోలు లేరని ఈ విధంగా అన్ని రకాల ఖాళీలు పేరుకుపోయి విద్యారంగం అస్తవ్యస్తమైందన్నారు. ఈ విద్యారంగ అపసవ్య ధోర్నులన్నీ ప్రపంచ బ్యాంకు కనుసనల్లో నడుస్తున్నాయని వీటికి ఏజెంటుగా ప్రభుత్వాలు ఉన్నాయని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలంటే ఈ విద్యారంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ రంగంతో పాటు ప్రజలు మరియు కార్మిక రంగం రైతాంగం అన్ని రంగాల వాళ్ళు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అశోక్ ఏ తిరుపతి లు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చెందుతున్న లక్ష్మారెడ్డి గారు నిబద్ధత కలిగిన కార్యకర్త అని ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చినప్పటినుండి డిటిఎఫ్ లోనే పనిచేస్తున్నారని డిటిఎఫ్ నిబంధన వలికి కట్టుబడి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఎదిగారని కొనియాడారు. ఒక నూతన సమాజాన్ని కాంక్షించడంలో తాను ముందుండేవాడని, ప్రస్తుతం ఉద్యోగ విరమణ చెందినప్పటికీ భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ గతంలోనూ ప్రస్తుతము మరియు భవిష్యత్తులోనూ నా మాతృ సంస్థ డి టి ఎఫ్ అని కొనియాడారు. భవిష్యత్తులో కూడా నేను ఉపాధ్యాయ ఉద్యమంలో కొనసాగుతానని మాటిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మహమ్మద్ అప్రోచ్, కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, డి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ వీరన్న, డి టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంకటేశ్వరాచారి, పి సుదర్శనం, రిటైర్డ్ ఎంప్లాయిస్ బాధ్యులు దేవదాసు, డి టి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పిఎస్ హెచ్ఎం యూనియన్ జిల్లా బాధ్యులు గణపతి నాయక్, ఎంపీపీ ఎస్ చెల్పూర్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి మరియు ఉపాధ్యాయ బృందం తోపాటు విద్యార్థిని విద్యార్థులు బంధువులు కార్యకర్తలు హాజరయ్యారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి వెలిచాల రాజేందర్‌రావు

# ఘన స్వాగతం

**కరీంనగర్, (జోర్దార్)**కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి బుధవారం కరీంనగర్ వచ్చిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఘన స్వాగతం పలికారు.
కలెక్టరేట్ హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి పూల మొక్క అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంతో పాటు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో రాజేందర్‌రావు పాల్గొన్నారు.



## ఆర్టీఐ ఆవిర్భావ దినోత్సవ అవగాహన

# సదస్సును జయప్రదం చేయండి







- రాష్ట్ర కో కన్వీనర్ గడప కృష్ణ.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, చట్టబద్ధంగా తమ హక్కులను సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచడమే లక్ష్యంగా అక్టోబర్ 7న రవీంద్రభారతిలో ఆర్టీఐ సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు తాండూర్ తాసిల్దార్ కార్యాలయంలో, డి టి కల్పన, ఎంపీడీవో కార్యాలయంలో, శ్రీనివాస్, ల ఆధ్వర్యంలో సదస్సు గోడప్రాతులను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా రాష్ట్ర కో-కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లపు రాజు ప్రకాష్ పటేల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందే విధానం, ప్రజలకు ఉన్న హక్కులు, ఆర్టీఐ దరఖాస్తు ప్రక్రియపై సదస్సులో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.
ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పురెళ్ల శ్రీనివాస్,కార్యదర్శి తునికి శ్రీనివాస్ రాజు, జిల్లా కోఆర్డినేటర్ పార్వతి అజయ్, తాండూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంపెల్లి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు చింతల సంతోష్, తోగరి సతీష్, అనిల్, పప్పుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖలో 'శంకర్ దాదాలు'..!!

- నాన్-ఐకార్, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాల ఆరోపణలు.. కొందరికి పదోన్నతులు!
- ఓ ఓఎస్డీ కూడా ఫేక్ సర్టిఫికెటెనా...
- 28 మంది అనర్హులుగా తేలినా చర్యలెక్కడ?
- ఇటీవలే అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్
- మొద్దు నిద్ర లో గోపి, సురేంద్ర మోహన్.. సీఎం రేవంత్ జర దేఖో...!!

**(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)** రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖలోనే అర్హతలపై అనుమానాలు తలెత్తుతున్నాయా? నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీలో ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం బయటపడిన తర్వాత కూడా కొందరిపై చర్యలు తీసుకోకపోగా, పదోన్నతులు కల్పించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

**28 మంది అనర్హులైతే.. చర్యలు ఎందుకు లేవు?**

వ్యవసాయ శాఖలో అర్హతల పరిశీలనలో 28 మంది అనర్హులుగా తేలినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజంగా అధికారిక విచారణలో ఈ సంఖ్య నిర్ధారణ అయి ఉంటే.. ఆ 28 మందిపై ఏం చర్యలు తీసుకున్నారు? వారి నియామకాలు రద్దయ్యాయా? సర్వీస్ రికార్డులను పరిశీలించారా? అప్పటి నుంచి వారికి లభించిన ప్రయోజనాలు, పదోన్నతుల సంగతేంటి? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.
అనర్హతపై విచారణ ఒకవైపు కొనసాగుతుండగా.. అదే సమయంలో పదోన్నతులు, కీలక బాధ్యతలు ఎలా వచ్చాయన్నదే అసలు ప్రశ్నగా మారింది.




**నాన్-ఐకార్ అర్హతలతో ఉద్యోగాలా?**

వ్యవసాయ రంగంలో విద్యార్హతలకు సంబంధించి గుర్తింపు, సమానత్వం, అర్హత ప్రమాణాలు కీలకం. ఈ నేపథ్యంలో నాన్-ఐకార్ సంస్థల నుంచి పొందిన డిగ్రీలు లేదా అనుమానాస్పద సర్టిఫికెట్లతో కొందరు ఉద్యోగాల్లోకి వచ్చారన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.
సర్టిఫికెట్లు నిజమైనవేనా? సంబంధిత కోర్సులకు గుర్తింపు ఉందా? నియామకం సమయంలో విద్యార్హతలను ఎవరు ధ్రువీకరించారు? ధ్రువీకరణలో లోపాలు జరిగితే బాధ్యులెవరు? అన్నదానిపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు.. పదోన్నతులు ఎలా?**

అసెంబ్లీలో మదన్‌మోహన్‌రావు లేవనెత్తిన ప్రధాన ప్రశ్న ఇదే. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఉద్యోగాల నుంచి తొలగించకుండా పదోన్నతులు ఎలా కల్పించారు? అని ఆయన ప్రశ్నించారు.
ఒక ఉద్యోగి విద్యార్హతపై అనుమానం వచ్చినప్పుడు సాధారణంగా ముందుగా సర్టిఫికెట్ ధ్రువీకరణ, సంబంధిత సంస్థల నుంచి నిర్ధారణ, ఆ తర్వాత శాఖాపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
మరి ఇక్కడ ఆ ప్రక్రియ ఏ దశలో ఉంది? ఫైళ్లు ఎక్కడ ఆగిపోయాయి? ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి? అనే ప్రశ్న లు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఓఎస్డీపై కూడా ప్రశ్నలు**

వ్యవసాయ శాఖ ఓఎస్డీ విద్యార్హతకు సంబంధించిన అంశంపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన పొందిన డిగ్రీ, దానిని జారీ చేసిన సంస్థకు ఉన్న గుర్తింపు, నియామకం లేదా నియామకానికి ముందు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలపై అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ ఉంది.

అయితే ఓఎస్డీ డిగ్రీ 'ఫేక్' అని తేల్చే అధికారిక ధ్రువీకరణ ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉన్న ఆధారాల్లో కనిపించడం లేదు. కాబట్టి ఈ అంశంపై సంబంధిత విశ్వవిద్యాలయం, గుర్తింపు సంస్థలు లేదా ప్రభుత్వం ఇచ్చే అధికారిక ధ్రువీకరణే కీలకం.

**ఫైళ్లు ఎవరి టేబుల్‌పై?**

విచారణలు జరిగితే వాటి ఫలితాలు ఎందుకు బయటకు రావడం లేదు? ఎవరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు? ఎవరిపై చర్యలు పెండింగ్‌లో ఉన్నాయి? పెండింగ్‌కు కారణమేంటి? విచారణ పూర్తయ్యేలోపు పదోన్నతులు ఎలా ఇచ్చారు? అన్న ప్రశ్నలకు వ్యవసాయ శాఖ సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విచారణ ఫైళ్లు ముందుకు కదలకపోతే.. అనుమానాలకు తావెవరూ ఇస్తున్నారు? అన్న ప్రశ్న కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**అసెంబ్లీ ప్రశ్నలతో కదిలేనా శాఖ?**

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీలో డిమాండ్ చేశారు.

**ఇక ప్రభుత్వం ముందున్న ప్రధాన అంశాలు ఇవే:**

- 28 మంది అనర్హులుగా తేలినట్లు చెబుతున్న వ్యవహారంపై అధికారిక నివేదిక ఏమిటి?
- ఎంతమందిపై చర్యలు తీసుకున్నారు?
- నాన్-ఐకార్ అర్హతలపై శాఖ ఏ నిర్ణయం తీసుకుంది?
- అనుమానాస్పద సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లోకి వచ్చిన వారికి పదోన్నతులు ఇచ్చారా?
- విచారణ ఫైళ్లు ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి?
- మంత్రి ఓఎస్డీ విద్యార్హతపై అధికారిక ధ్రువీకరణ ఏమిటి?

రైతుల ప్రయోజనాలను పర్యవేక్షించాల్సిన శాఖలోనే ఉద్యోగుల అర్హతలపై ఇలాంటి ప్రశ్నలు తలెత్తడం వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే అంశంగా మారకుండా ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

# చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన సంజూ




క్రీడా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2026 ఆసియా క్రీడల పోరాటానికి భారత జట్టు రెడీగా ఉంది. ఈ టోర్నమెంట్‌లో సెప్టెంబర్ 28న జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అఫ్ఘానిస్తాన్‌తో భారత్ తలపడనుంది. పురుషుల క్రికెట్ విభాగంలో పది దేశాలు బంగారు పతకం కోసం పోటీపడుతుండగా, టీమిండియా నేరుగా క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. ఈ కీలక మ్యాచ్‌లో క్రికెట్ లవర్స్ కేరళ స్టార్ ఆటగాడు సంజూ శాంసన్? ప్రదర్శన కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఓపెనర్‌గా బరిలోకి దిగనున్న సంజూమొదటి మ్యాచ్‌లో భారత జట్టు తరఫున సంజూ ?శాంసన్ ఇన్నింగ్స్ ఆరంభించడానికి ఓపెనర్‌గా క్రీజులోకి దిగడం ఖాయమైంది. ఆసియా క్రీడల్లో సంచలన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తాడని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. గతంలో అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన టీ-20 సిరీస్‌లో సంజూ అద్భుతమైన ఫామ్ కనబరిచాడు. వరుసగా రెండు హాఫ్ సెంచరీలు బాది తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. ఆసియా క్రీడలకు ముందు జరిగిన సన్నాహక మ్యాచ్‌ల్లోనూ రాణించి మంచి ఊపు మీదున్నాడు. చరిత్ర సృష్టించే అరుదైన అవకాశంఈ మ్యాచ్‌లో సంజూ మరో అరుదైన రికార్డును తన పేరు మీద లిఖించుకోవడానికి అడుగు దూరంలో నిలిచాడు. మ్యాచ్‌లో కేవలం ఆరు సిక్సర్లు బాదితే చాలు, భారత్ తరఫున అంతర్జాతీయ టీ-20ల్లో 100 సిక్సర్ల మైలురాయిని అందుకుంటాడు. ఈ ఘనత సాధించిన ఆరో భారతీయ క్రికెటర్‌గా చరిత్రపుటల్లో నిలుస్తాడు. ఇప్పటికే రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, విరాట్ కోహ్లీ, అభిషేక్ శర్మ వంటి దిగ్గజాలు ఈ జాబితాలో ఉండగా, ఇప్పుడు ఆ సరసన చేరే అద్భుత అవకాశం మన సంజూ ? ముందుంది.

# వర్షాన్ని సైతం తట్టుకొని పరుగు.. ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో బంగారు పతకం




జపాన్ వేదికగా కొనసాగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సంచలన ప్రదర్శనతో దూసుకుపోతున్నారు. తాజాగా జరిగిన మహిళల 4ఇ400 మీటర్ల రిలే రేస్ ఈవెంట్‌లో భారత జట్టు బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రీడల్లో భారత్‌కు ఇది 6వ స్వర్ణ పతకం కావడం విశేషం. పరుగు పందెంలో మొదటి నుంచి చివరి వరకు అద్భుతమైన ఆధిపత్యం ప్రదర్శించిన మన క్రీడాకారిణులు, దేశానికి మరొక మరపురాని విజయాన్ని అందించారు. భారత క్రీడా ప్రపంచం ప్రస్తుతం ఈ ఘనతపై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. ఈ ఘన విజయంలో భారత రిలే బృందానికి చెందిన కిరణ్, మచేత్తిరా పూవమ్మ, ప్రాచి, విత్య రామ్‌రాజ్ అత్యంత కీలక పాత్ర పోషించారు. ట్రాక్‌పై రేస్ ప్రారంభమైనప్పటి నుంచీ ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వీరు పరుగెత్తారు. భారత జట్టు సరిగ్గా 3:29.69 నిమిషాల వ్యవధిలో రేసును పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచింది. ఈ జట్టులోని విత్య రామ్‌రాజ్‌కు ఈ టోర్నీలో ఇది రెండో పతకం కావడం గమనార్హం. అంతకుముందు ఆమె 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు. ఫైనల్ రేస్ సమయంలో మైదానంలో భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భారత అథ్లెట్లు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. తడిసిన ట్రాక్‌పై పరుగెత్తడం కష్టమైనప్పటికీ, మన క్రీడాకారిణులు సమయోచితంగా స్పందించి విజయం సాధించారు. బలమైన బహ్రెయిన్ జట్టు 3:30.21 నిమిషాల్లో రేసును పూర్తి చేసి రజత పతకానికే పరిమితమైంది. భారత్ కంటే కేవలం 0.52 సెకన్ల తేడాతో బహ్రెయిన్ రెండో స్థానానికి పడిపోయింది. ఇక ఆతిథ్య చైనా జట్టు 3:31.02 నిమిషాల సమయంతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు భారత్ క్రికెట్, కబడ్డీ, షూటింగ్ వంటి విభాగాలోనే స్వర్ణ పతకాలు గెలుచుకుంది. ఈ విజయం ట్రాక్ అండ్ ఫీల్డ్ (అథ్లెటిక్స్) విభాగంలో భారత్‌కు లభించిన

# చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన రో-కో జోడీ..




భారత క్రికెట్ జట్టు శుభమన్ గిల్ కెప్టెన్సీలో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య సెప్టెంబర్ 27 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ వన్డే సిరీస్ భారత జట్టుకు మాత్రమే కాకుండా, స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఎంతో ప్రత్యేకమైనదిగా నిలవనుంది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళు అరుదైన మైలురాళ్లను అధిగమించేందుకు కేవలం అతి కొద్ది దూరంలో నిలిచారు. దీంతో ఈ సిరీస్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. విరాట్ కోహ్లీ అరదైన రికార్డుటీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో మరో చారిత్రాత్మక మైలురాయికి అడుగు దూరంలో నిలిచాడు. ఇప్పటివరకు 314 వన్డే మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ 14,941 పరుగులు సాధించాడు. వన్డేల్లో 15,000 పరుగుల మార్క్‌ను చేరుకోవడానికి ఆయనకు కేవలం 59 పరుగులు మాత్రమే అవసరం. ఈ సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగే తొలి మ్యాచ్‌లోనే కోహ్లీ ఈ ఫీట్‌ను సాధిస్తే, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ప్రపంచ బ్యాటర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. 12 వేల పరుగుల రికార్డుమరోవైపు భారతీయ డాషింగ్ ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ కూడా మరో అద్భుతమైన రికార్డుకు చేరువయ్యాడు. ఇప్పటివరకు 288 వన్డే మ్యాచ్‌లు ఆడిన రోహిత్ 11,895 పరుగులు పూర్తి చేశాడు. వన్డే క్రికెట్‌లో 12,000 పరుగుల క్లబ్‌లో చేరడానికి ఆయనకు మరో 105 పరుగులు కావాలి. ఇప్పటివరకు ప్రపంచ క్రికెట్ చరిత్రలో కేవలం ఆరుగురు బ్యాటర్లు మాత్రమే 12 వేలకు పైగా వన్డే పరుగులు సాధించారు. ఇప్పుడు రోహిత్ శర్మ కూడా ఆ జాబితాలో చేరేందుకు సిద్ధమవుతుండటం భారత క్రికెట్ అభిమానులకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. చారిత్రాత్మక సిరీస్‌గా భారత్ -- వెస్టిండీస్ సమరంసెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ఈ రికార్డులను మొదటి మ్యాచ్‌లోనే సాధిస్తే, ఈ సిరీస్ భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు ఈ సీనియర్ ఆటగాళ్ల అనుభవం ఎంతో ఉపయోగపడనుంది. విండీస్ గడ్డపై లేదా స్వదేశంలో జరిగే ఈ మ్యాచ్‌లలో రో-కో జోడీ ఏ విధంగా రాణిస్తుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# పసిడి ప్రియులకు షాక్.. మళ్లీ ఆకాశాన్ని తాకుతున్న ధరలు..!



. ధరలు ఒక్కసారిగా పతనం

గోల్డ్ ప్రియులకు ఊరట కలిగింది. ధరలు మరోసారి డౌన్ అవుతున్నాయి. గత మూడు వారాలుగా పసిడి దిగొస్తోంది. పెళ్లిళ్ల సీజన్ కావడం, త్వరలో వినాయక చవితి, దసరా పండగలు రానున్న క్రమంలో గోల్డ్ రేట్లు పతనమమవుతుండటం కొనుగోలు చేయాలనుకునేవారికి ఉపశమనం కల్గిస్తోంది. డాలర్ విలువ బలపడటం, అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం భయాల క్రమంలో ధరలు క్రాష్ అవుతున్నాయి. అయితే ఈ ధరల పతనం అనేది ఎన్ని రోజులు ఉంటుందని ఎవరూ అంచనా వేయలేమని మార్కెట్ అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల అంచనాలపై స్పష్టత రావడం లేదు. దీంతో బంగారం ధరల్లో ఎప్పుడైనా మార్పులు జరగొచ్చని అనలిస్టులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు క్రాష్ అవ్వడంతో.. దేశీయంగా కూడా కుప్పవిశ్లేషిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల అంచనాలపై కూలాయి. సెప్టెంబర్ 10వ తేదీన దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు చూద్దాం.బంగారం ధరలు ఇవే..

-దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,300 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,440గా ఉంది.-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ.1,54,300గా ఉండగా.. 22 క్యారెట్లు చూస్తే రూ.1,41,440 వద్ద ట్రేడవుతోంది.-చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,54,300, 22 క్యారెట్ల రేటు రూ.1,41,440గా కొనసాగుతోంది.-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,54,450 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,590గా ఉంది-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.1,54,300 వద్ద కొనసాగుతుడగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,440 పలుకుతున్నాయి.వెండి రేట్లు ఇవే..వెండి ధరలు కూడా పతనమయ్యాయి. గత కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న ధరలు.. గురువారం స్వల్పంగా తగ్గుముఖం పట్టావిశ్లేషిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల అంచనాలపై యి. బెంగళూరులో కేజీ వెండి ధర రూ.2,49,900 వద్ద కొనసాగుతోండగా.. నిన్న రూ.2.50 లక్షలుగా ఉంది.-హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,54,900 వద్ద ఉండగా.. నిన్న రూ.2.55 లక్షలు పలికాయి-చెన్నైలో కిలో సిల్వర్ ధర రూ.2,54,900 వద్ద ట్రేడవుతోంది.-ఢిల్లీలో కేజీ వెండి రూ.2,49,900గా ప్రస్తుతం ఉండగా.. బుధవారం రూ.2.50 లక్షల వద్ద స్థిరపడింది

# SBI కస్టమర్లకు షాక్.. అక్టోబర్ 1 నుంచి కొత్త విత్‌డ్రా రూల్స్!




అక్టోబర్ 15వ తేదీ నుండి ఖూ× పై ఛార్జీలు అమలులోకి రానున్నాయి. దానికి ముందే దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ూదీ×) అక్టోబర్ 1, 2026 నుండి అమలులోకి వచ్చేలా తన కొంతమంది కస్టమర్ల కోసం నగదు ఉపసంహరణ నిబంధనలను మార్చింది. కొత్త నిబంధనల ప్రకారం.. నిర్దేశించిన ఉచిత పరిమితికి మించి నగదు ఉపసంహరించుకుంటే కస్టమర్లు ఇకపై అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అందువల్ల మీకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ూదీ×)లో ఖాతా ఉండి, మీరు తరచుగా-ూవీలు లేదా ఇతర మార్గాల ద్వారా నగదు ఉపసంహరించుకుంటున్నట్లయితే, డబ్బు విత్‌డ్రా చేసే ముందు కొత్త నిబంధనలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ మార్పు ఎస్‌బీఐ ఖాతాదారులందరికీ వర్తించదు. ఈ నియమం ప్రత్యేకంగా బ్రాంచుల ద్వారా తెరిచిన బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (దీూదీణ) ఖాతాలు ఉన్న కస్టమర్లకు వర్తిస్తుంది. అక్టోబర్ 1వ తేదీ నుండి ఏమేమి మారబోతున్నాయో, నగదు ఉపసంహరణపై విధించే ఛార్జీల గురించి తెలుసుకుందాం. నెలలో ఎన్ని సార్లు ఉచితంగా నగదు ఉపసంహరణ లభిస్తుంది? స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన అధికారిక ప్లాట్‌ఫామ్ 'శ'లో ఒక పోస్ట్‌లో ూదీ× దీూదీణ ఖాతాదారులకు ప్రతి నెలా పరిమిత సంఖ్యలో ఉచిత నగదు ఉపసంహరణలకు అనుమతి ఉందని పేర్కొంది. అయితే, అక్టోబర్ 1వ తేదీ తర్వాత నెలకు నాలుగు నగదు ఉపసంహరణల వరకు ఉచితంగానే ఉంటాయి. అంటే, నాలుగు సార్లు నగదు ఉపసంహరించుకోవడానికి అదనపు ఛార్జీ ఉండదు. అయితే, మీరు నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ నగదు ఉపసంహరించుకుంటే, అదనపు లావాదేవీ ఛార్జీలు విధించవచ్చు. 4 సార్లు వరకు ఉచితంగా నగదు విత్‌డ్రా4 లావాదేవీల తర్వాత ప్రతి అదనపు నగదు ఉపసంహరణకు రూ. 15 ఛార్జీ విధించవచ్చు.

దీనితో పాటు వర్తించే జీఎస్టీని కూడా చెల్లించాల్సి ఉంటుంది. సులభంగా చెప్పాలంటే, మీరు మీ ఖాతా నుండి నెలకు నాలుగు సార్లు ఉచితంగా నగదు తీసుకోవచ్చు. కానీ ఈ పరిమితికి మించి డబ్బు విత్‌డ్రా చేస్తే మీ జేబుపై అదనపు భారం పడుతుంది. డిజిటల్ లావాదేవీలపై ఛార్జీ ఉంటుందా? ఎస్‌బిఐ బ్యాంక్ ప్రకారం, ఈ మార్పు డిజిటల్ లావాదేవీలపై ప్రభావం చూపదు. అంటే వినియోగదారులు మునుపటిలాగే ఉచిత డిజిటల్ చెల్లింపులు కొనసాగించవచ్చు. అలాగే

# ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారికి బిగ్ అలర్ట్.. వచ్చేఏడాది నుంచి కొత్త రూల్స్..!




ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారి సంఖ్య పెరిగిపోతుంటుంది. ఇప్పుడు పండల సీజన్ల నేపథ్యంలో ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌లలో భారీ ఆఫర్లు ఉంటాయి. అయితే ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు అందులో మీ పేరు, ఫోన్ నంబర్, డెలివరీ చిరునామా, లాగిన్ వివరాలు, చెల్లింపు సమాచారం ఉండవచ్చు. జనవరి 2027 నుండి అమల్లోకి రానున్న భారతదేశపు కొత్త వినియోగదారుల రక్షణ (ఇ-కామర్స్) (సవరణ) నిబంధనలు, 2026, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లను మరింత పారదర్శకంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ నిబంధనలు ధరల నిర్ణయం, విక్రేత వెల్లడింపులు, సెర్చ్ ర్యాంకింగ్‌లు, ప్రకటనలు, డార్క్ ప్యాటర్న్‌లు, వినియోగదారుల డేటా, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో అవసరాలను కఠినతరం చేస్తాయి. పండుగ సీజన్ అయినా లేదా ఏదైనా సాధారణ రోజు అయినా, ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలో కనిపించే "బంపర్ సేల్స్" "భారీ డిస్కౌంట్లు" వంటి ట్యాగ్‌లు తరచుగా మనల్ని ఆకర్షిస్తాయి. కానీ చాలాసార్లు, ఈ ఆఫర్లు కేవలం కంటికి కనిపించే మాయగానే మిగిలిపోతాయి. ఇప్పుడు, ఇ-కామర్స్ కంపెనీల ఈ మోసాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. వినియోగదారుల వ్యవహారాల శాఖ "వినియోగదారుల రక్షణ (ఇ-కామర్స్) (సవరణ) నిబంధనలు, 2026ను జారీ చేసింది. ఇవి జనవరి 1, 2027 నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయి. డిజిటల్ మోసాల నుండి వినియోగదారులను రక్షించడం ద్వారా స్వచ్ఛమైన మరియు పారదర్శకమైన ఇ-కామర్స్ వ్యవస్థను సృష్టించడమే ఈ కొత్త నిబంధనల యొక్క ప్రధాన ఉద్దేశ్యం. 2025 సంవత్సరపు గణాంకాలను పరిశీలిస్తే, జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (చీజుు)లో మొత్తం 17.71 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో 29 శాతం (సుమారు 5.11 లక్షలు) కేవలం ఈ-కామర్స్ రంగం నుంచే వచ్చాయి. పెరుగుతున్న వినియోగదారుల ఆందోళనలకు ప్రతిస్పందనగా, అన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు చీజుు వ్యవస్థతో అనుసంధానం కావడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇది వినియోగదారుల సమస్యల వేగవంతమైన పరిష్కారానికి దోహదపడుతుంది.



తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా రాణిస్తుంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి అడుగుపెట్టిన ఈ హర్యానా భామ.. తక్కువ సమయంలోనే స్టార్ హీరోల సరసన నటించే స్థాయికి ఎదిగింది. అందంతో పాటు నటనతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వరుస అవకాశాలను అందుకుంటోంది. మీనాక్షి చౌదరి సినీ ప్రయాణం 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో ప్రారంభమైంది.అయితే అడివి శేష్ ప్రధాన పాత్రలో నటించిన 'హిట్: ది సెకండ్ కేస్' మూవీ ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఈ సినిమా తర్వాత మీనాక్షికి టాలీవుడ్‌లో వరుస అవకాశాలు రావడం మొదలైంది. పెద్ద హీరోల సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతుంది. రీసెంట్ గా మీనాక్షి నటించిన సినిమాల్లో కొన్ని మంచి విజయాలను అందుకోవడంతో ఆమెకు ఇండస్ట్రీలో డిమాండ్ మరింత పెరిగింది. ముఖ్యంగా 'గుంటూరు కారం', 'సంక్రాంతికి వస్తున్నాం', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలు ఆమె కెరీర్‌కు మరింత బలాన్ని ఇచ్చాయి.అయితే అడివి శేష్ ప్రధాన పాత్రలో నటించిన 'హిట్: ది సెకండ్ కేస్' మూవీ ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఈ సినిమా తర్వాత మీనాక్షికి టాలీవుడ్‌లో వరుస అవకాశాలు రావడం మొదలైంది. పెద్ద హీరోల సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతుంది. రీసెంట్ గా మీనాక్షి నటించిన సినిమాల్లో కొన్ని మంచి విజయాలను అందుకోవడంతో ఆమెకు ఇండస్ట్రీలో డిమాండ్ మరింత పెరిగింది. ముఖ్యంగా 'గుంటూరు కారం', 'సంక్రాంతికి వస్తున్నాం', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలు ఆమె కెరీర్‌కు మరింత బలాన్ని ఇచ్చాయి.సంక్రాంతి సీజన్‌లో వచ్చిన సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరైన మీనాక్షి.. వరుస విజయాలు అందుకుంటున్న హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం మీనాక్షి చేతిలో మరికొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. నాగచైతన్య హీరోగా తెరకెక్కుతున్న 'వృషకర్మ' చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా పైన కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇదే సమయంలో మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వార్త ఇప్పుడు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.సంక్రాంతి సీజన్‌లో వచ్చిన సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరైన మీనాక్షి.. వరుస విజయాలు అందుకుంటున్న హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం

## మరో జాక్‌పాట్ కొట్టేసిన మీనాక్షి చౌదరి.

## ఓటీటీషోకు హోస్ట్‌గా చిరంజీవి భారీ రెమ్యునరేషన్!



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం ఫుల్ జోష్ లో ఉన్నారు. మన శంకరవరప్రసాద్ గారు ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో వరుసగా సినిమాఉల చేస్తున్నారాయన. ప్రస్తుతం చిరంజీవి బాబీ కొల్లి తో కాకా, వశిష్టతో విశ్వంభర, శ్రీకాంత్ ఓదెలతో సినిమాలు చేయనున్నాడు. అయితే ఇంత బిజీ షెడ్యూల్ లోనూ చిరంజీవి ఓ టాక్ షో చేయనున్నాడని తెగ ప్రచారం జరుగుతోంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ ఈ సెలబ్రిటీ టాక్ షోను ప్లాన్ చేస్తోందని, ఇందుకు మెగాస్టార్ ను హోస్ట్ గా వ్యవహరించనున్నారని సమాచారం. తెలుగుతో పాటు ఇతర భాషలకు చెందిన ప్రముఖులు చిరంజీవి టాక్ షోకు రానున్నారని, ఇప్పటికే ఈ షో కోసం రోడ్ మ్యాప్ పూర్తయ్యిందని టాక్. ఇందుకు సంబంధించి నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు ఆల్రెడీ చిరంజీవి టీ వ్ం ది తో సంప్రదించారని, అతి త్వరలోనే ఈ టాక్ షో గురించి అధికారికంగా అనౌన్స్ మెంట్ చేయనున్నారని సమాచారం. ఇదిలా ఉంటే సుమారు 47 ఏళ్ల సినిమా కెరీర్ లో చిరంజీవి పెద్దగా టాక్ షోలు చేయలేదు. కొన్నేళ్ల క్రితం 'మీలో ఎవరు కోటీశ్వరుడు' అనే క్విజ్ రియాలిటీ షోకు మాత్రమే హోస్ట్ గా వ్యవహరించారు. తనదైన స్క్రీన్ ప్రజెన్స్, హోస్టింగ్ తో షోను రక్తి కట్టించారు. దీని తర్వాత ఇప్పుడు మరో టాక్ షోకు మెగాస్టార్ రెడీ అవుతున్నారని సమాచారం.ఇదిలా ఉంటే ఈ సెలబ్రిటీ టాక్ షో కోసం చిరంజీవికి 200 కోట్ల రూపాయల భారీ పారితోషికాన్ని నెట్‌ఫ్లిక్స్ ఆఫర్ చేసిందట. ఓటీటీ హిస్టరీలో ఓ టాక్ షో కోసం ఇంత భారీ అమౌంట్ ఆఫర్ చేయడం ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. ఇందులో నిజమెంతుందో తెలియదు కానీ ప్రస్తుతం ఈ వార్త సినిమా సర్కిళ్లలో హాట్ టాపిక్ గా మారింది. ఒక వేళ ఇదే నిజమైతే ఓటీటీ హిస్టరీలోనే అత్యధిక రెమ్యునరేషన్ అందుకున్న హీరోగా చిరంజీవి మరో ఘనతను అందుకుంటారు. కాగా నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందనున్న చిరంజీవి టాక్ షోకి సంబంధించిన చర్చలు, ఒప్పంద వ్యవహారాలను చిరంజీవి పెద్ద కుమార్తె సుష్మిత కొణిదెల దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని సమాచారం. త్వరలోనే ఈ టాక్ షోకు సంబంధించి మరిన్ని అప్డేట్స్ రానున్నాయని టాక్.



## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ ' చిత్రం గొప్ప విజయాన్ని సాధించాలి

ఎస్.ఎస్. రాజమౌళి సమర్పణలో ఫహాద్ ఫాజిల్ హీరోగా నటించిన ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ '. ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్ల మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన ఈ చిత్రానికి శశాంక్ ఏలేటి దర్శకుడు. అక్టోబర్ 2న మూవీ రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.ఈ వేడుకకు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో. హీరో ఫాహద్ ఫాజిల్ మాట్లాడుతూ "ఇంత అభిమానం ఎప్పుడూ చూడలేదు. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. 90 శాతం లైవ్ లొకేషన్స్ లో షూట్ చేశాం. చాలా మంచి ఫీల్ కలిగింది. ఈ సినిమా షూటింగ్ లో దర్శక నిర్మాతలు, సినిమా యూనిట్ అంతా ఎంతో సపోర్ట్ చేశారు. నిజంగా బాగా ఎంజాయ్ చేస్తూ పని చేశాం. ఈ సినిమా మొదలైనప్పుడే మీ సపోర్ట్ మాకు దొరికింది. మీరు ఈ ఈవెంట్ కి రావడం చాలా ఆనందంగా ఉంది. అక్టోబర్ 2 న మా సినిమా చూడండి" అన్నారు. చైల్డ్ ఆర్టిస్ట్ సారా మాట్లాడుతూ.. "ఈ సినిమా ఛాన్స్ ఇచ్చిన దర్శక నిర్మాతలకు చాలా థాంక్స్. ఫాఫా తో పని చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. అక్టోబర్ 2న అందరూ ఈ సినిమా చూడండి..జై ఎన్టీఆర్" అన్నారు.నిర్మాత ఎస్ ఎస్ కార్తికేయ మాట్లాడుతూ.. "నిర్మాతగా ఇది నా మొదటి సినిమా. ఇది ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే సినిమా. ఇది డెబ్యూ డైరెక్టర్ తీసిన సినిమాలా ఉండదు. ఈ సినిమాలో ప్రతి సీన్ కొత్తగా ఉండేలా దర్శకుడు శశాంక్ మంచి ఔట్ పుట్ ఇచ్చారు. నిర్మాత అంటే ఇలాగే ఉండాలి అని శోబు గారిని చూసి నేర్చుకున్నా. షోయింగ్ బిజినెస్ అని నా బ్యానర్ పేరు పెట్టిందే కీరవాణి బాబాయ్. ఆయనకు స్పెషల్ థాంక్స్. ఫాహద్ ఫాజిల్ సినిమాలంటే నాకు పిచ్చి. ఆ పిచ్చిలోనే శాశాంక్ కథ విని ఫాహద్ ఫాజిల్ కి ఈ కథ చెప్పాలని అన్నా. ఆయన ఈ సినిమా చేయడం చాలా హ్యాపీ. బాబా (రాజమౌళి) మీ పేరును

## త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పుడూ గడ్డంతోనే కనిపిస్తారు.. కారణేమేంటో తెలుసా?



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. డైలాగ్ రైటర్ గా ,సినీ రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు త్రివిక్రమ్. ముఖ్యంగా టాలీవుడ్ లో ఫ్యామిలీ ఓరియంటెడ్ సినిమాలకు ఆయన కేరాఫ్ అడ్రస్ గా మారిపోయారు. నువ్వే నువ్వే, అతడు, జల్సా, ఖలేజా, జులాయి, అత్తారింటికి దారేది, సన్ ఆఫ్ సత్యమూర్తి, అ ఆ, అరవింద సమేత, అల వైకుంఠపురములో, గుంటూరు కారం సినిమాలతో తెలుగులో స్టార్ డైరెక్టర్ గా గుర్తింపు తెచ్చుకున్నారు త్రివిక్రమ్. ప్రస్తుతం విక్టరీ వెంకటేష్ తో కలిసి ఆదర్శ కుటుంబం హౌస్ నెంబర్ 47 అనే మరో ఫ్యామిలీ ఓరియంటెడ్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్, సాంగ్ ఆడియెన్స్ ను అమితంగా ఆకట్టుకున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 9వ తేదీన రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాల్లో స్పీడ్ పెంచారు. హీరో వెంకటేష్, డైరెక్టర్ త్రివిక్రమ్ కూడా వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో విక్టరీ వెంకటేష్ తో కలిసి త్రివిక్రమ్ శ్రీనివాస్ స్టార్ యాంకర్ సుమతో ఒక స్పెషల్ ఇంటర్వ్యూ నిర్వహించారు.ఈ ఇంటర్వ్యూలో భాగంగా వెంకీ, త్రివిక్రమ్ ల వ్యక్తిగత విషయాలతో పాటు వారి సినిమాలకు సంబంధించిన ఎన్నో విషయాల గురించి సుమ సరదాగా ముచ్చటించారు. ఈ నేపథ్యంలోనే సుమ త్రివిక్రమ్ తో మాట్లాడుతూ.. 'అత్తారింటికి దారేది సినిమాలో పవన్ కల్యాణ్ చెప్పిన విధంగా సింహం మాత్రమే కాదు త్రివిక్రమ్ కూడా గడ్డం గీసుకోరు ఎందుకు? అని ప్రశ్నించింది. దీనికి త్రివిక్రమ్ సమాధానం చెబుతూ 'పెళ్లయిన కొత్తలో నా భార్య కూడా గడ్డం లేకుండా చూసింది. అయితే అప్పటినుంచి నేను ఇలా గడ్డంతోనే ఉన్నాను. నేను గడ్డం తీసేస్తే బహుశా నన్ను ఎవరు గుర్తుపట్టరేమో అందుకే తీయట్లేదు. నా ఆధార్ కార్డ్ ,పాస్ పోర్ట్ అన్నింటిలో కూడా నా ఫోటో గడ్డంతోనే ఉంది. ఇప్పుడు గడ్డం తీసేస్తే ఇమిగ్రేషన్ సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందుకే

## ఓ చిన్నపిల్లని పెళ్లి చేసుకున్నా



సినిమా ఇండస్ట్రీలో ఉన్న అందమైన జోడీల్లో ఫహాద్ ఫాజిల్, నజ్రియా నజీమ్ జంట కూడా ఒకటి. 2014లో పెళ్లి చేసుకున్న ఈ దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉంటారు. ఆ మధ్యన వీరు విడాకుల తీసుకుంటున్నారని వార్తలు వచ్చినా అవి రూమర్లుగానే మిగిలిపోయాయి. ఫహాద్ ఫాజిల్, నజ్రియా నజీమ్‌లది ప్రేమ వివాహం. వీరు 'బెంగళూరు డేస్' సినిమాలో భార్యాభర్తలుగా నటించారు. ఆ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ మొదలైంది. ఆ తర్వాత ఇరు పెద్దల ఆశీర్వాందతో 2014లో వీరు పెళ్లిపీటలెక్కారు. కాగా ఈ జంట ఎంతో అన్యోన్యంగా ఉన్నప్పటికీ తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పెద్దగా బయటకు చెప్పరు. అయితే అప్పుడప్పుడు ఇంటర్వ్యూల్లో ఫహాద్– నజ్రియా సరదాగా చేసే వ్యాఖ్యలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటుటాయి. అలా తాజాగా మరోసారి తన భార్య నజ్రియాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ఫహాద్. వివరాల్లోకి వెళితే.. ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి తెరకెక్కించిన ఈ సినిమాలో , సారా పాలేకర్, సౌరభ్ సచ్దేవ్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ శుక్రవారం (అక్టోబర్ 02)న ప్రేక్షకుల ముందుకు రానుంది.'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' నిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఫహాద్ ఫాజిల్ సారా పాలేకర్ గురించి మాట్లాడారు. సినిమా షూటింగ్ సమయంలో ఆమె చూపించిన ఓపిక, నటన కోసం చేసిన సన్నాహకాలను ఫహాద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే క్రమంలో తన భార్య నజ్రియాను

## బిగ్ బాస్ ఇంట్లో టెన్షన్.. ఆమె బ్యాక్ బిచ్చింగ్ స్టార్.. అతను కన్నింగ్



బిగ్ బాస్ ఇంట్లో మూడో వారం కెప్టెన్సీ కంటెండర్ టాస్కులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కంటెస్టెంట్ల మధ్య పోటీ, గొడవలు, భావోద్వేగాలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు ఇంటి సభ్యుల ఆటతీరుపై బయట ప్రేక్షకుల్లో ఉన్న అభిప్రాయాలను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూపించడం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా షాలినీ, రాం ప్రసాద్, త్రిగుణ్, వర్షిణి, సుధీర్‌లపై వచ్చిన కామెంట్లు ఇంట్లో చర్చకు దారితీశాయి. కెప్టెన్సీ కంటెండర్ టాస్కుల్లో భాగంగా రెండు బజర్‌లను ముందుగా ఎవరు టచ్ చేశారనే దానిపై నరేష్, వంశీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని తేల్చే బాధ్యత త్రిగుణ్‌పై పడింది. మొదట నరేష్ ముందుగా బజర్ పట్టుకున్నాడని చెప్పిన త్రిగుణ్.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. చివరకు వంశీనే ముందుగా బజర్ టచ్ చేశాడని ప్రకటించాడు. ఒకవేళ తన నిర్ణయం తప్పయితే దానికి తానే బాధ్యత వహించి పనిష్మెంట్ తీసుకుంటానని త్రిగుణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది.
మరో టాస్క్‌లో వంశీ, ఝాన్సీ పోటీ పడగా.. ఝాన్సీ విజయం సాధించింది. దీంతో ఆమెకు కెప్టెన్సీ కంటెండర్‌గా నిలిచే అవకాశం రావడంతో పాటు ఫ్యామిలీ ఫోటోను పొందే ఛాన్స్ కూడా దక్కింది. అయితే తనకు లభించిన ఆప్షన్స్‌లో నరేష్‌కు సంబంధించిన లెటర్‌ను ఎంచుకున్న ఝాన్సీ.. దాన్ని ముక్కలు చేయడంతో నరేష్‌కు టెన్షన్ మొదలైంది. తర్వాత కంటెస్టెంట్లకు కాస్త రిలీఫ్ ఇచ్చేలా గార్డెన్ ఏరియాలోకి బిగ్ బాస్ భారీగా ఫుడ్ పంపించాడు. ఇంటి సభ్యులంతా కలిసి ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. కానీ ఆ ఆనందం

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224